



# విజయభాను







విశాఖపట్నం, బుధవారం 10-06-2020 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 236 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## విద్యాసంవత్సరంపై కేంద్రం కీలక నిర్ణయం

- సిలబస్, పనిగంటలు మార్పుకు యోచన
- సూచనలు పంపాలని కోరిన కేంద్ర మంత్రి



దిల్లీ: రాబోయే విద్యాసంవత్సరానికి పాఠ్యాంశాల కుదింపు, తరగతుల నిర్వహణ సమయాన్ని తగ్గించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోక్రియాల్ నిశాంక్ తెలిపారు. ఈ మేరకు 'సిలబస్ ఫర్ స్టూడెంట్స్ 2020' హ్యాష్‌ట్యాగ్ పేరుతో ట్విటర్, ఫేస్‌బుక్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, పాఠశాల నిర్వాహకులు వారి ఆలోచనలు, సూచనలు తనతో పంచుకోవాలని మంత్రి కోరారు. వాటిని తుది నిర్ణయంలో పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. "ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు రాబోయే విద్యాసంవత్సరానికి బోధనాంశాల కుదింపు, తరగతుల నిర్వహణ సమయం తగ్గించేందుకు ఉన్న అవకాశాలపై దృష్టి సారించాం" అని మంత్రి ట్విటర్‌లో పేర్కొన్నారు. ఆగస్టు 15 తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం కావచ్చని మంత్రి రమేశ్ పోక్రియాల్ నిశాంక్ సోమవారం సూచనప్రాయంగా తెలిపారు.

ఈ నేపథ్యంలో మంగళవారం

అన్ని రాష్ట్రాలకు చెందిన విద్యాశాఖ కార్యదర్శులతో కేంద్ర మాన వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనితా

తరువాయి 2లో..

## చాలా స్వల్పం..చాలా జాప్యం : బృందాకారత్



న్యూఢిల్లీ: వలస కార్మికుల విషయంలో సుప్రీంకోర్టు ప్రయత్నాలను 'చాలా స్వల్పం...చాలా జాప్యం'గా సీపీఎం నేత బృందాకారత్ అభివర్ణించారు. వలస కార్మి కుల అవస్థలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలపై ఆమె స్పందించారు. 'గర్భిణీ స్త్రీలు, పిల్లలతో సహా వలస కార్మికులు ఇళ్లకు తిరుగుముఖం పడుతున్నప్పుడు సుప్రీంకోర్టు ఎమైంది?

తరువాయి 2లో..

# అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చాలి



- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇసుక బుకింగ్
- కరోనా వ్యాప్తిని అరికట్టడంలో కలెక్టర్లు బాగా పనిచేశారు
- 15 కొత్త మెడికల్ కాలేజీలు కట్టబోతున్నాం
- మద్యం దుకాణాలు తగ్గించాం

## 'స్పందన'పై సీఎం వైఎస్ జగన్ సమీక్ష

తాడేపల్లి: సొంత అవసరాల కోసం గ్రామాల్లో ఉన్నవాళ్లు.. ఎడ్లబండ్ల ద్వారా 5 కి.మీ పరిధిలో ఇసుక తెచ్చుకోవచ్చని ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయంలో ఇందుకు సంబంధించి అనుమతులు తీసుకోవచ్చని వెల్లడించారు. స్పందన కార్యక్రమంపై సీఎం జగన్ మంగళ వారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇసుక రీచ్‌లను తెరవాలని అధికారులను ఆదేశించారు. జూన్ చివరి నాటికి రోజుకు 3లక్షల టన్నుల ఇసుక నిల్వ లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అదే విధంగా వర్షాలు కురిసే నాటికి 70 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని.. కొత్త వనరులను గుర్తించి మరిన్ని ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. "గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షించాలి. బల్క్ బుకింగ్ అనుమతులు జాయింట్ కలెక్టర్ చూసుకోవాలి"అని సీఎం జగన్ పేర్కొన్నారు.

**నాడు- నేడు కార్యక్రమంపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి**

రెండు వారాల క్రితం 35 లక్షల మంది ఉపాధి హామీ పనులకు వచ్చేవారన్న సీఎం జగన్.. ఇప్పుడు ఆ సంఖ్య 54.5 లక్షలకు చేరిందని హర్షం వ్యక్తం చేశారు. పెద్ద మొత్తంలో పనులు కల్పిస్తున్నందుకు కలెక్టర్లకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. వచ్చే

తరువాయి 2లో..

## దరఖాస్తులను నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి

విశాఖపట్నం : గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రజలు వివిధ ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందడానికి పెట్టుకున్న దరఖాస్తులను నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు ఆయన సెక్రటేరియట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల పంపిణీ, ఇసుక, ఉపాధి హామీ పనులు, ఈ - క్రాప్, నాడు - నేడు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడీలు భవనాల నిర్మాణం, కోవిద్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. బియ్యం కార్డు, పెన్షన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఇళ్ల స్థలాల పట్టాల కై దరఖాస్తులను నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలను



తరువాయి 2లో..

## సీఎం జగన్‌తో సినీ పెద్దల భేటీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు చిత్ర పరిశ్రమ అన్ని రకాలుగా అభివృద్ధి చేయటానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. జులై 15వ తేదీ తర్వాత ఏపీలో షూటింగ్‌లు చేసుకునేందుకు సీఎం అంగీకరించారని చిరు తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన

తరువాయి 2లో..

## గూగుల్ సెర్చ్ హెడ్‌గా ప్రభాకర్ రాఘవన్



న్యూయార్క్ : సెర్చి ఇంజన్ దిగ్గజం గూగుల్‌లో మరో భారత సంతతి వ్యక్తి కీలక పదవిలో నియమితులయ్యారు. గూగుల్ సెర్చ్ హెడ్‌గా భారత సంతతికి చెందిన ప్రభాకర్ రాఘవన్ నియమితులయ్యారు. బెన్ గోమ్ స్థానంలో ఈ పదవిని చేపట్టే రాఘవన్ నూతన బాధ్యతల్లో నేరుగా సీఈఓ సుందర్ పిచాయ్‌కు రిపోర్ట్ చేస్తారు. ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తిచేసిన ప్రభాకర్ బెర్కిలీ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పొందారు. 2012లో గూగుల్‌లో చేరిన రాఘవన్ 2018లో గూగుల్ అ?డ్వర్టైజింగ్, కామర్స్ బిజినెస్ హెడ్‌గా ఎదిగారు. సెర్చి డిస్‌ప్లే పర్యవేక్షణ, వీడియా అడ్వర్టైజింగ్ అనలిటిక్స్, షాపింగ్, పేమెంట్స్ వ్యవహారాలను ఆయన పర్యవేక్షించారు. రాఘవన్

తరువాయి 2లో..

## సంవత్సర కాలంలో 90% శాతం హామీలు అమలు

- పార్లమెంటు నియోజక వర్గానికొక మెడికల్ కళాశాల ఏర్పాటు
- దేశంలోనే టాప్ 4 ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెల్లడి



విశాఖపట్నం : రాష్ట్రంలో పార్లమెంటు నియోజక వర్గానికొక మెడికల్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు యువజన సర్వీసులు, క్రీడలు శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం మేఘాలయ హెూటల్ లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన సర్వేలో టాప్ 5 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నదని, ముఖ్యమంత్రి మొట్టమొదటి సారిగా అధికారంలోకి వచ్చి టాప్ 4 లో బెస్ట్ సి.యం.గా వై.యస్. జగన్ మోహన్ రెడ్డి నిలిచారని చెప్పారు. ప్రభుత్వం అధికారం చేపట్టి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న నాటికి హామీల్లో 90 శాతం అమలు చేసిట్లు పేర్కొన్నారు. వార్షిక ఆదాయం 5 లక్షల రూపాయలు ఉన్న వారికి ఆరోగ్య శ్రీ కార్డు వర్తిస్తుందని, రూ.1000/-లు దాటితే ఆరోగ్య శ్రీ వర్తిస్తుందని, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ లలో వైద్యం చేయించుకొనే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిదని తెలిపారు. పార్లమెంటయి నియోజక వర్గానికొక మెడికల్ కళాశాలలో బాగంగా అరకు పార్లమెంటు పరిధిలో పాడేరుకు ఒక మెడికల్ కళాశాల మంజూరు చేయడమైనదని, ఉప ముఖ్యమంత్రి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి భూ పరిశీలన చేయడం జరిగిందని, అనకాపల్లి పార్లమెంటులో కూడా వైద్య కళాశాల ఏర్పాటుకు భూ పరిశీలన చేసినట్లు ఆయన వెల్లడించారు. పేద ప్రజలకు వైద్యం అందించడమే ప్రభుత్వ ద్యేయమన్నారు. పేద ప్రజలు డాక్టర్లు, ఇంజనీర్లు చదువుకుంటున్నారని, పేద ప్రజలకు పూర్తి స్థాయిలో ఫీజు రీఎంబార్స్ మెంటు కల్పించినట్లు చెప్పారు. ప్రతీ ఇంట చదువు వెలుగు వెలిగించి, వారిని అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. అమ్మఒడి పథకంనకు 6500 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. జూన్ 1వ తేదీ నుండి 2500 రూపాయలు పింఛను అందుతుందన్నారు. ఇళ్ల వద్దకే పెన్షన్లు వాలంటీర్ల తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో 25 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి అంతకంటే ఎక్కువ పట్టాలు సమారు 28 లక్షల ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పట్టాలు పంపిణీ పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా, అవినీతి రహితంగా, పారదర్శకంగా ఉంటుందన్నారు. మహిళలకు సున్నా వడ్డీకి ఋణాలు, మధ్యపాన నిషేధంలో భాగంగా 43 వేల బెల్ట్ షాపులు తగ్గించడమైనదని, బార్ లు తగ్గాయని, మద్యం ధరలు పెంచినట్లు పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరచాలన్నదే ముఖ్యమంత్రి

తరువాయి 2లో..




## ఏబీవీపీ ఆధ్వర్యంలో కూలీలకు మజ్జిగ పంపిణీ



భీమునిపట్నం : గొట్టిపల్లి గ్రామం వాస్తవ్యులు బుత్తల రమణ కుమారుడు బుత్తల గురునాయుడు జన్మదినం సందర్భంగా వారి యొక్క ఆర్థిక సహాయంతో ఏబీవి పి ఆధ్వర్యం లో గొట్టిపల్లి పంచాయితీలో చెరువు పనులు చేస్తున్న 400 మంది కూలీలకు మజ్జిగ పంపిణీ నిర్వహించారు.

ఈ ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ లొడగల అచ్చిబాబు తెలిపారు. ఈ కార్యక్రమం లో గణేష్, ఈశ్వరరావు, వర్ధన్,రమణ, మహేశ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుభరోసా కేంద్రాలలో భూసార పరీక్షలు పై అవగాహన



భీమునిపట్నం : భీమిలి మండలం మజ్జి పేట నగరపాలెం గ్రామాలలో రైతు భరోసా కేంద్రాల లో భూసార పరీక్షలు మరియు వాటి ఆవశ్యకతను భూసార పరీక్ష కిట్ ఉపయోగించి భూసార పరీక్షలు నిర్వహించారు అలాగే భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా తెలియజేశారు ఇందులో భాగంగా వ్యవసాయ సహాయ సంచాలకులు టి.శ్రీదేవి విధానము చూపించారు. రైతులు తమ పంట భూమి లో లోపాలను తెలుసుకోవడానికి భూసార పరీక్షలు జరిపించు కోవాలని అన్నారు భూసార పరీక్ష ద్వారా ఎరువులపై ఖర్చును తగ్గించుకోవచ్చు మరియు పోషక లోపాలు ను నివారించుకునే మంచి పంటలను రైతులు పొందవచ్చు అని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు బీ జ్యోతిర్మయి, టి.తులసి మణి , శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

### జనసేన పార్టీ ఆధ్వర్యంలో

## ఆటో డ్రైవర్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ



మధురవాడ : కరోనా మహమ్మారి కారణం గా పనులు లేక ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లు కు జనసేన పార్టీ 6వ వార్డ్ అబ్యర్థి పోతిన అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం సేవనగర్ కాలనిలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్లల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో పోతిన నానజీ, వార్డ్ అధ్యక్షులు సంతోష్ నాయుడు, అప్పలరాజు మాస్టర్, అనిల్ సింగ్, కిషోర్ ,నాగోతి ప్రకాష్, సుబ్రమణ్యం ప్రసాద్, వాంద్రసి శ్రీను, బేవర రాజు,పోతిన అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి భక్తులకు దుర్గాలమ్మ దర్శనం



మధురవాడ : మధురవాడ చంద్రంపాలెం జాతరగట్టు పై కొలువైయున్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో పిళ్లా సూరిబాబు అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ లాక్ డౌన్ కారణంగా సుమారు 80 రోజులు నేటి వరకు అమ్మవారికి ప్రతి రోజు ఉదయం నిత్య పూజలలో భాగంగా నైవేద్యం సమర్పించి ఆలయం మూసివేయబడినది.

అలాగే లాక్ డౌన్ సమయంలో ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, అమ్మవారి వారాలు పండగ మొదలగు ఉత్సవాలు భక్తులు లేకుండా నిడారంబరంగా జరిపించామని, పస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్ డౌన్ సడలించడంతో ప్రతి భక్తుడు మాస్క్ ధరించి రావాలని, ఆలయంలో శానిటైజర్ అందుబాటులో ఉంచి ప్రతి భక్తుడు చేతికి స్ప్రే చేయించాలని, భక్తునికి భక్తునికి కనీసం ఆరు అడుగుల దూరం పాటించాలని, అలాగే దానికి తగ్గట్టుగా ఆలయంలో మార్కింగ్ కూడా చేయడం వంటివి ఆలయంలో ఒక పర్యాయం 20 మంది భక్తులకే పరిమితం చేయాలని, కరోనా వైరస్ సంపూర్ణంగా నిర్మూలం అయ్యేంత వరకు ఆలయంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయుట నిషేదించామని భక్తులందరూ సహకరించాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్త పిళ్లా కృష్ణంనాయుడు, కార్యదర్శి నాగోతి తాతారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిళ్లా శ్రీనువాసరావు, సభ్యలు తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్-19 పరీక్షలలో రాష్ట్రం ప్రథమ స్థానం

### -కోవిడ్-19 స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ అర్జా

శ్రీకాకుళం : కోవిడ్-19 పరీక్షలు చేయడంలో దేశంలో ఆంధ్ర ప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందని కోవిడ్ 19 స్టేట్ నోడల్ ఆఫీసర్ డా. అర్జా శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు ఏ.పి.కోవిడ్-19 కమాండ్ కంట్రోల్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసారు. మన రాష్ట్రంలో కనీసం టెస్టింగ్ ల్యాబ్ లేని స్థితి నుంచి ఇప్పుడు దేశంలోనే అత్యధికంగా కోవిడ్ పరీక్షలు చేసే స్థాయికి చేరిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 1వ తేదీన తొలి కోవిడ్ నమూనా శాంపిల్స్ సేకరించిందని అన్నారు. ఈ కోవిడ్ నమూనా పరీక్ష ఫలితం కోసం పూణెలోని ల్యాబ్స్ కు పంపించామని, అప్పటి వరకు మన రాష్ట్రంలో కోవిడ్-19 నమూనాలను పరీక్షించడానికి ఎలాంటి ల్యాబ్స్ అందుబాటులో లేవని ఆ ప్రకటనలో తెలిపారు. అప్పటికే రాష్ట్రంలో ప్రజలపై కోవిడ్ తీవ్ర ప్రభావం చూపించడం ప్రారంభమైందని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ నమూనాల సేకరణకు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచుకోవడం మరియు కోవిడ్ పరీక్షలు చేయడానికి అవసరమైన ల్యాబ్స్ ఏర్పాటుపై దృష్టిసారించిందని అన్నారు. మార్చి 10న తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వైద్య విజాన సంస్థ (స్విమ్స్)లో మొట్ట మొదటి ప్రయోగశాలను ప్రారంభించడానికి ఐ.సి.ఎం.ఆర్ నుంచి అనుమతి లభించిందని, అప్పటి నుంచి పరీక్షలు చేయడం, పరీక్షల సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం మరింత దృష్టి సారించిందని వివరించారు. తర్వాత విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనూ కోవిడ్ టెస్టింగ్ ల్యాబ్స్ అందుబాటులోకి వచ్చాయన్న సంగతిని ఆయన గుర్తుచేసారు. ప్రస్తుతం రాష్ట్రంలో వీ.ఆర్.డి.ఎల్ ట్రునాట్ పరీక్షల ల్యాబ్స్ కలిపి మొత్తం 68 ప్రయోగశాలలు ఉన్నాయని, ఈ ల్యాబ్స్ అన్నీ 24 గంటలు పనిచేస్తూ ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో జూన్ 6వ తేదీన 17,695 నమూనాలను పరీక్షించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 7 వరకు మొత్తం 4,68,276 మందికి కరోనా పరీక్షలను నిర్వహించడం జరిగిందని వివరించారు. ఈ నమూనాల్లో వీ.ఆర్.డి.ఎల్ మరియు ట్రునాట్ పరీక్షలు మాత్రమే ఉన్నాయని స్పష్టం చేసారు. ఇవి కాకుండా రాష్ట్ర ప్రభుత్వం సి.ఎల్.ఐ.ఎ %డ% ఆర్.డి.కె పరీక్షలను కూడా చేస్తోందని, అయితే ఈ పరీక్షలు కేవలం స్క్రీనింగ్ కోసం మాత్రమే ఉపయోగించడం జరుగుతుందని, వీటిని ప్రధాన పరీక్ష ఫలితాల్లో చూపించడం లేదని ఆయన తెలిపారు. జూన్ 8 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా చేసిన కోవిడ్ పరీక్షల సంఖ్య 4,68,276 కు చేరిందని అన్నారు. ఇందులో 4,813 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, వీరిలో 838 మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కాగా, 132 మంది విదేశాల నుంచి వచ్చిన వారు ఉన్నారని ఆ ప్రకటనలో తెలిపారు. టెస్టింగ్ సామర్థ్యం పెంచుకోవడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుతూ టెస్ట్ ఫలితాలను కోవిడ్ ఆస్పత్రులతో అనుసంధానం చేసి ఎలాంటి జాప్యం లేకుండా, ప్రజలకు ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాలు కలగజేస్తోందని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

## ఇసుక డోర్ డెలివరీ పెరగాలి

### - జిల్లా కలెక్టర్ జె.నివాస్




శ్రీకాకుళం : జిల్లాలో ఇసుక డోర్ డెలివరీ మరింత పెరగాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.60 శాతం మేర ఇసుక డోర్ డెలివరీకి కేటాయింపులు చేయాలని అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇసుక సరఫరాపై సంబంధిత అధికారుల రీచ్ ల నిర్వాహకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక డోర్ డెలివరీ పెరగాలన్నారు. ఇసుకను డోర్ డెలివరీ చేయాలనే విధానాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టారని, దానికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఆదేశించారు. జిల్లాలో డోర్ డెలివరీ చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సంయుక్త కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 23 రీచ్ లలో 12 రీచ్ లు పనిచేస్తున్నాయని, 6 రీచ్ లలో ఇసుక నిల్వలు అధికంగా ఉన్నాయని తెలిపారు. కరోనా లాక్ డౌన్ తరువాత ఆర్థిక కార్యకలాపాలకు ప్రభుత్వం సడలింపులు ఇచ్చిన నేపథ్యంలో ఇసుక తవ్వకాలు పెరగాలని, ఇసుక సరఫరాను కూడా మరింత ఎక్కువగా పెంచాలని ఆదేశించారు. ఎక్కడా పెండింగ్ ఉండరాదని, తవ్విన ఇసుకలో కొంతమేర రిజర్వ్ పెట్టి మిగిలిన మొత్తంను బల్క్, డోర్ డెలివరీలకు సరఫరా చేయాలని సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో ఉప రవాణా కమీషనర్ డా.వడ్డి సుందర్, ఎం.వి.ఐ వేణుగోపాల్, గనుల శాఖ ఉప సంచాలకులు సిహెచ్.సూర్యచంద్రరావు, జిల్లా ఇసుక అధికారి ప్రతాప్ రాజు, రీచ్ ల నిర్వాహకులు తదితరులు హాజరయ్యారు.

## అందుకే జగన్‌కు బొత్స భజన చేస్తున్నారు : అయ్యన్న



విజయవాడ: మంత్రి బొత్స సత్యనారాయణ నోటిని అదుపులో పెట్టుకోవాలని టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు.

చంద్రబా బును విమర్శిం చే నైతికహక్కు బొత్సకు లేదన్నారు. వైఎస్ మృతికి జగనే కారణమని గతంలో బొత్స ఆరోపించారని గుర్తు చేశారు. మంత్రి పదవి వచ్చేప్పటికి జగన్‌కు బొత్స భజన చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో మద్యం మాఫియా చెలరేగుతోందన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## 'స్పందన'పై సీఎం వైఎస్ జగన్ సమీక్ష

సమీక్షా సమావేశం నాటికి 60లక్షల మందికి పనులు కల్పించాలని ఆదేశించారు. అదే విధంగా... 55వేల అంగన్‌వాడీల్లో 31 వేల చోట్ల కొత్త బిల్డింగ్‌లు కట్టాలని.. అంగన్‌వాడీల నిర్మాణంపై దృష్టి పెట్టాలని సీఎం జగన్ ఆదేశించారు. పట్టణ, నగరాల్లో వైఎస్సార్ క్లీనిక్స్‌పై మ్యాపింగ్ చేయబోతున్నారు.. వీటి స్థలాలు గుర్తించే పనిని యుద్ధప్రాతిపదికన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా.. నాడు-నేడు కార్యక్రమంపై కలెక్టర్లు దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**ఐసోలేషన్ సదుపాయాలపై దృష్టి పెట్టండి**

"కరోనా వ్యాప్తిని అరికట్టడంలో కలెక్టర్లు బాగా పనిచేశారు. కరోనా నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు తొలగించాలి. అనుమానం రాగానే పరీక్షలు చేయించుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు. 85శాతం కేసులు ఇంట్లోనే మందులు తీసుకోవడంతో

తగ్గిపోతుంది. కేవలం 2శాతం మాత్రమే మరణాలు రేటు ఉంది. ఆస్పత్రుల సన్నద్ధతను కలెక్టర్లు పర్యవేక్షించాలి. ఐసోలేషన్ సదుపాయాలపై కూడా దృష్టి పెట్టాలి" అని సీఎం జగన్ ఆదేశించారు.

**15 కొత్త మెడికల్ కాలేజీలు**

స్కూళ్లలో నాడు-నేడు కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించాలి. 15 కొత్త మెడికల్ కాలేజీలను కట్టబోతున్నాం. ఒక్కో మెడికల్ కాలేజీకి 50 ఎకరాల స్థలం కావాలి. కొత్త మెడికల్ కాలేజీలకు అవసరమైన స్థలాలను గుర్తించాలి

**మద్యం దుకాణాలు తగ్గించాం**

లిక్కర్ వినియోగం తగ్గించడానికి అన్నిరకాల చర్యలూ తీసుకున్నామని సీఎం జగన్ అన్నారు. 43 వేల బెల్టుషాపులు ఎత్తివేశామని.. 33శాతం మద్యం దుకాణాలు తగ్గించామని తెలిపారు. మద్యం విక్రయించే వేళలను బాగా తగ్గించామని.. షాక్ కొట్టే రీతిలో రేట్లు పెంచామన్నారు. ఇవన్నీ చేస్తున్నప్పుడు.. మద్యం అక్రమ రవాణా, తయారీ జరగకుండా చూడాల్సిన ఆవశ్యకత ఎక్కువగా ఉందన్నారు. మద్యం, ఇసుక అక్రమాల్లో ఎవరు ఉన్నా కూడా ఉపేక్షించవద్దని అధికారులకు స్పష్టం చేశారు.

## విద్యాసంవత్సరంపై కేంద్రం కీలక నిర్ణయం

కార్వాల్ (పాఠశాల విద్య) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పాఠశాలల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ తరగతుల నిర్వహణ వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. కరోనా మహమ్మారిపై పోరులో భాగంగా మార్చి 16 నుంచి కేంద్ర ప్రభుత్వం పాఠశాలలు, యూనివర్శిటీలు మూసివేయాలని నిర్ణయించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే విద్యార్థులను తర్వాతి తరగతులకు ప్రమోట్ చేశాయి. ఇప్పటికే పలు విద్యాసంస్థలు కొత్త విద్యాసంవత్సరాన్ని కొనసాగిస్తూ ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించాయి.

## చాలా స్వల్పం..చాలా జాప్యం: బృందాకారత్

ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. చేసింది చాలా స్వల్పం. ఇంతకుముందు పిటిషన్లు వేస్తే విచారణకు నిరాకరించారు. తదుపరి విచారణ తేదీని కూడా ఎప్పటికో వాయిదా వేశారు' అని బృందాకారత్ అన్నారు. కేంద్రం చెప్పిన ప్రతిదానికి అత్యున్నత న్యాయస్థానం సరేననడంపై మాట్లాడుతూ.. 'కోట్లాది మంది వలస కార్మికులు ఇప్పటికే ఇళ్లకు చేరారు. వాళ్లు అప్పులు చేసి ప్రయాణాలు చేసారు. ఆ డబ్బులు వారికి ఎవరు తిరిగి చెల్లిస్తారు? నగదు బదిలీ ద్వారా వారికి పరిహారం ఇచ్చే విషయాన్ని పరిశీలించి, ఆ దిశగా కోర్టు ఆదేశాలు ఇస్తుందా? ఇవాళ చేయాల్సింది కూడా అదే' అని కారత్ అన్నారు. దీనికిముందు, సుప్రీంకోర్టు మంగళవారంనాడు విచారణ సందర్భంగా రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో చిక్కుకున్న వలస కార్మికులను, ఇళ్లకు వెళ్లాలనుకుంటున్న వారిని గుర్తించి 15 రోజుల్లోగా వారికి సొంత రాష్ట్రాలకు పంపించే ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులిచ్చింది. డిజాస్టర్ మేనేజిమెట్ యాక్ట్ -2005 కింద లాక్‌డౌన్ ఉత్తర్వులు ఉల్లంఘిచారన్న ఆరోపణలపై వలస కార్మికులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకునే విషయాన్ని కూడా పరిశీలించాలని కోర్టు పేర్కొంది. డిమాండ్‌ను బట్టి 24 గంటల్లోగా శ్రామిక్ ప్రత్యేక రైళ్లు సమకూర్చాలని కోర్టు ఆదేశించింది.

## సంవత్సర కాలంలో 90% శాతం హామిలు అమలు

ఉద్దేశమన్నారు. అందరి సహాయ సహకారాలతో ప్రభుత్వం ఒక సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకోవడమైనదని, రానున్న 4 సంవత్సరాలకు అందరి సహాయ సహకారాలు అందించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని తెలిపారు.

విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎం.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలోపే హామీలను 90 శాతం అమలు చేసినట్లు చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రతీ పేద వారు వినియోగించుకోవాలన్నారు. కోవిడ్-19 నేపథ్యంలో పేద ప్రజల ఖర్చుకు రూ.1000/-లు, 5 విడతలుగా రేషన్ పంపిణీ చేసినట్లు చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. ఈ సమావేశంలో గాజువాక శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తులను నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని

సంతృప్తస్థాయిలో పారదర్శకత తో, వివక్ష లేకుండా అమలు చేసి, అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సో విశాఖపట్టణం నుంచి కలెక్టర్ వి. వినయ్ చంద్, వి ఎం ఆర్ డి ఎ కమిషనర్ కోటేశ్వరరావు, జీవీఎంసీ కమిషనర్ జి. సృజన, జాయింట్ కలెక్టర్- 1 ఎం. వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ - 2 అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ - 3 గోవిందరావు, ఎస్పీ ఏ. బాబూజీ , ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తో సినీ పెద్దల భేటీ

పలువురు ప్రముఖులు మంగళవారం సీఎం జగన్‌ను తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. అగ్ర నటులు చిరంజీవి, నాగార్జున, దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు సురేశ్‌బాబు, సి.కల్యాణ్, దిల్‌రాజు తదిరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధి, సమస్యలు, పరిష్కారంపై ఈ సందర్భంగా సీఎం జగన్‌తో వారు చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో సమావేశం అనంతరం అగ్ర కథానాయకుడు చిరంజీవి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "తెలుగు సినీ పరిశ్రమలోని ప్రముఖులతో కలిసి ఏడాది కాలంగా సీఎం జగన్‌ను కలవాలని అనుకున్నాం. ఇప్పుడు కరోనా కారణంగా కొద్ది మంది మాత్రమే వచ్చాం. రాష్ట్రంలో తెలుగు సినీ పరిశ్రమ రాణించడానికి వెసులుబాటును కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపాం. లాక్‌డౌన్ సమయంలో షూటింగ్‌లు స్తంభించిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే షూటింగ్‌లకు అనుమతి ఇచ్చింది. జూన్ 15 తర్వాత చిత్రీకరణలకు అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో సినీ పరిశ్రమలోని సమస్యలను ఏపీ సీఎం జగన్‌కు దృష్టికి తీసుకొచ్చేందుకు ఈరోజు ఆయన్ను కలిశాం. అన్నింటినీ సీఎం జగన్ సావధానంగా విని, సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? అందుకు సంబంధించిన విధివిధానాలను మంత్రి నాని, ఇతర అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామన్నారు" "లాక్‌డౌన్ కారణంగా థియేటర్లు మూతబడి పునః ప్రారంభం కాని పరిస్థితుల్లో ఉన్నాయి. ఈ సమయంలో థియేటర్ల మినిమం పవర్ టారిఫ్‌లను రద్దు చేయాలని కోరాం. దాని కూడా సీఎం జగన్ అంగీకారం తెలిపారు. ఇక గత కొంతకాలంగా నంది అవార్డులు ఆలస్యమవుతూ వస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని ప్రతి నటుడు, టెక్నీషియన్ కోరుకుంటాడు. దీని కూడా 2019-20 సంబంధించిన అవార్డులు ఇచ్చేందుకు నిర్ణయించారు. దీని వల్ల భారీ సినిమాలు తీసే నిర్మాతలకు మేలు జరుగుతుంది. ఏపీలో చిత్రపరిశ్రమ అభివృద్ధి కోసం వైఎస్ హయాంలో విశాఖలో 300 ఎకరాలను కేటాయించారు. దాన్ని పునః పరిశీలిస్తానని చెప్పారు. ఏపీలో సినిమాలు నిర్మించాలి. అవుట్ డోర్ యూనిట్లు పెట్టాలనుకునేవాళ్లకు అది అన్ని విధాలా ఉపయోగపడుతుంది. సినీ పరిశ్రమకు సంబంధించిన అన్ని సమస్యలను విని, సానుకూలంగా స్పందించిన సీఎం జగన్‌కు చిత్ర పరిశ్రమ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నా" అని చిరంజీవి చెప్పుకొచ్చారు. ఆయన వెంట మంత్రి పేర్ని నాని, నాగార్జున, రాజమౌళి, సురేశ్‌బాబు, దిల్‌రాజు, సి.కల్యాణ్ తదితరులు ఉన్నారు.

## గూగుల్ సెర్చ్ హెడ్‌గా ప్రభాకర్ రాఘవన్

అంతకుముందు గూగుల్ క్లౌడ్ సేవలు, గూగుల్ యాప్స్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. ఇక ఐబీఎం, యాహూల్లోనూ ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. జీమెయిల్, గూగుల్ డ్రైవ్ నెలకు 100 కోట్ల యాక్టివ్ యూజర్ల మైలురాయిని అధిగమించడంలో రాఘవన్ పాత్ర కీలకం. జీ సూట్‌లో స్మార్ట్ రిప్లై, స్మార్ట్ కంపోజ్, డ్రైవ్ క్విక్ యాక్సెస్ వంటి ఫీచర్లను ఆయన ప్రవేశపెట్టారు. కొత్త బాధ్యతల్లో రాఘవన్ ప్రభాకర్ అనుభవం ఎంతో ఉపకరిస్తుందని.. అలాఘరిథంలు, ర్యాంకింగ్‌ల విషయంలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఆయన సొంతమని, గూగుల్ కంటే ముందే గూగుల్ సెర్చ్‌తో రాఘవన్‌కు అనుబంధం ఉందని గూగుల్, అల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ సభ్యుడిగా ఈ రంగంలో గొప్ప ఇంజనీరింగ్ మేథస్సుల్లో ఆయన ఒకరని ప్రస్తుతించారు.

# అబద్ధాలు, అప్పులు, రౌడీ రాజ్యంగా ఏపీ

- వైస్సార్సీపీ ప్రభుత్వం ఏడాది విధ్వంసకర పాలన పై ఎమ్మెల్యే వాసుపల్లి గళం
- కీలక పదవులు అన్ని రెడ్డి కులస్తులకేనా?
- బాబూ హయాంలో సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి సాధించాం
- టీడీపీ విశాఖ నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



విశాఖసిటీ : విశాఖ తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో విశాఖ టీడీపీ అర్బన్ జిల్లా అధ్యక్షులు మరియు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అధ్యక్షతన విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంవత్సర కాలంగా చేస్తున్న విధ్వంస పాలనకు ఒక నిదర్శం అనే 24 పేజీల పుస్తకం ను విడుదల చేశారు. ఆంధ్రరాష్ట్రాన్ని ఒక రౌడి రాజ్యం ఏలు తుందని అన్నారు. మొన్న ఎక్స్ ఎం.పి.హర్ష కుమార్ ను అరెస్ట్ చేసే విధానమును తప్పు పట్టారు. ఎల్జీ పాలిమార్స్ విషయంలో మేము, వామపక్షాలు పోరాడుతుంటే మాపై కేసులు పెడుతున్నారని కమ్మ వారంటే ఈ ప్రభుత్వానికి మంట అని రోహింగ్యాల కంటే హీనంగా చూస్తున్నారని, లి213 కీలక పదవుల్లో రెడ్డి కులస్తులలి ను పెట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రం లి1950లి నుంచి ఇప్పటివరకు అన్ని ప్రభుత్వాలు కలసి 2.50 లక్షల కోట్లు అప్పులి చేస్తే ఈ ప్రభుత్వం 1 సంవత్సరం లోనే లి82వేల కోట్లు అప్పులి చేశారని ఆరోపించారు. గతంలో మా ప్రభుత్వం కి ఒక విజన్ ఉండేదని ఈ ప్రభుత్వం కి అది లేదని చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీ, శంసాబాద్ ఎయిర్పోర్ట్ లాంటివి కడితే ఈరోజు తెలంగాణ 8.5 జిడిపి తో మంచి పొజిషన్ లో ఉందని అన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమరావతి ని చంపేసారని అన్నారు. అన్ని రాష్ట్రాలు ఎఫ్1 రేస్ లో వెళుతుంటే మన ముఖ్యమంత్రి ఎడ్లబండి మీద వెళతాను అంటే ఎలా అని ఎద్దేవాచేశారు. చంద్రబాబు అన్నిదేశాలకు వెళ్లి ఆంధ్రప్రదేశ్ ను ఒక హబ్ గా చేస్తే ఈ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని అన్నారు. విశాఖపట్నం కు వచ్చిన లిఓక్స్ వేగన్ కార్ల కంపెనీలి ను మినిస్టర్ బొత్స సత్యనారాయణ గారు వెనక్కి పంపించేసారని అన్నారు. 604 కోట్లు స్పోర్ట్స్ కి బడ్జెట్ పెట్టారని ఈ డబ్బు సాలరీ లకే వస్తాయని ఒక బంతి కూడా కొనలేక పోయారని స్పోర్ట్స్ ను ఈ ప్రభుత్వం ను చంపేసిందని అన్నారు. పాత పథకాలకు కొత్త పేర్లు పెట్టారు తప్ప మీరు సాధించింది ఏంటని అన్నారు. లిబిసి,ఎస్సి, మైనార్టీ కాపులి కార్పొరేషన్ ల డబ్బులు అమ్మవడి కోసం వినియోగించారని అన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన మార్చుకోవాలని లేదంటే రాష్ట్రం అధోగతి పాలు అవుతుందని అన్నారు.

మద్యపాన నిషేధం అని చెప్పి మద్యాన్ని ఎక్కువ రేట్లు పెట్టి అమ్ముతున్నారని మధ్య పాన నిషేధం చేయలేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామా రావు, స్టేట్ టీడీపీ సెక్రెటరీ నజీర్, ఆనందబాబు, పాసర్ల ప్రసాద్, నోడగల కృష్ణ, పుచ్చా విజయ్ కుమార్, రామానంద్, ఇమంది రమన, బాపు ఆనంద్, పాడుగు కుమార్, కనకరాజు, గనగళ్ల సత్యవతి, గనగళ్ల రామరాజు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పై మంత్రి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లిన ఎంపీ భర్త శివప్రసాద్



శాలువతో సత్కరిస్తున్న ఎంపి భర్త శివప్రసాద్

కొయ్యూరు : రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రిని ఆయన నివాసంలో అరకు ఎంపి గొడ్డేటి మాధవి భర్త శివప్రసాద్ మర్యాద పూర్వ కంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం మన్యం ప్రాంతంలో వస్తున్న సీజనల్ వ్యాధుల గురించి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి మరెన్ని సదుపాయాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా ఆసుపత్రిలో ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు సరిపడా మందులను వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసి మెడికల్ క్యాంపులు నిర్వహి స్తామని హామీ ఇవ్వడం జరిగింది.

## పదవ తరగతి పరీక్షలు రద్దు చేయాలి

భీమునిపట్నం: పదవ తరగతి పరీక్షలు రద్దుచేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తు కి బాటలు వేయాలని, భీమిలి బీజేపీ 3 వార్డు అధ్యక్షుడు సత్తరపు వాయునందన రావు అన్నారు. కరోనా లాక్డౌన్ నేపథ్యంలో పదవ తరగతి ఫైనల్ పరీక్షలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసి ఇంటర్నల్ మార్కుల ద్వారా వారికి గ్రేడింగ్ ఇచ్చినట్లుగానే మన రాష్ట్రం లో కూడా కరోనా కేసులు సంఖ్య పెరుగుతున్నం దువలన పదవ తరగతి పరీక్షలు రద్దుచేసి , పరీక్షలు వ్రాసే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉన్న కరోనా భయాలను తొలగించాలని చెప్పారు. ఇప్పటికే 11 పరీక్షలకు గాను 6 పరీక్షలకు కుదించి ముఖ్యమంత్రి మంచి నిర్ణయం తీసుకున్నారని అన్ని వర్గాల ప్రజలు హర్షించారని అన్నారు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆ నిర్ణయాన్ని పునః సమీక్షించి రద్దు దిశగా నిర్ణయం తీసుకుంటారని, తల్లిదండ్రుల ఆకాంక్షాలకు అనుగుణంగా పరీక్షలు రద్దు చేసి, ఎన్నో సాహసోపేత నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తోడ్పడుతున్న మన ప్రభుత్వం పదవ తరగతి పరీక్షలు రద్దు దిశగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## పిఎచ్‌సి కి శానిటైజర్, మాస్కులు అందించిన గురుస్థానం ది ప్లే స్కూల్ అధినేత



మధురువాడ : మహా విశాఖ జోన్ 1 పరిధి 6వ వార్డు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గరలో ఉన్న గురుస్థానం ధి ప్లే స్కూల్ డైరెక్టర్స్ ఎస్. ఖాన్ మరియు నిషా ఆధ్వర్యంలో మంగళవారం మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల డాక్టర్స్ మరియు సిబ్బందికి పది లీటర్ల సానిటైజర్ మరియు వంద మాస్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎస్.ఖాన్ మాట్లాడుతూ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారిని తుదముట్టించేందుకు వైద్యులు, నర్సులు, ఇతర మెడికల్ సిబ్బంది నిద్రాహారాలు మాని తమ సేవలను అందిస్తున్నారని,వైద్య బృందం చేస్తున్న సేవలకి గాను సామాన్యులు, సెలబ్రిటీలు ప్రతి ఒక్కరు వారిపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. కొందరు వారిని దేవుడిలా కొలుస్తున్నారని ఆయన అన్నారు.కరోనా మహమ్మారి పై వైద్యులు ఎప్పటికప్పుడు ప్రజలలో చైతన్యం కలిగిస్తున్నారని అన్నారు. అనంతరం పి హెచ్ సి వైద్యాధికారిని డా.. అశ్విని శైలజ మాట్లాడుతూ మమ్మల్ని గుర్తించి ఈ విధంగా సహాయం చేసినందుకు చాలా సంతోషంగా ఉందని,నిత్యం విధి నిర్వహణలో మాకు ఎక్కవగా ఈ సనిటైజర్ బాగా ఉపయోగపడుతుందని,ఈ సందర్భంగా మాస్కులు మరియు సనిటైజర్ ఇచ్చినందుకు స్కూల్ డైరెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమాదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోతిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



మధురవాడ : రాష్ట్రంలో వైసీపీ చారిత్రిక విజయానికి రాష్ట్ర మంత్రిగా అవంతి ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా మహా విశాఖ జోన్ 1 పరిధి 7 వ వార్డ్ పరిధి వాంబే కాలనిలో వార్డ్ అధ్యక్షుడు పోతిన శ్రీనివాస్ మరియు వార్డ్ వైసీపీ అభ్యర్థి పోతిన లక్ష్మిపరమేశ్వరి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోతిన శ్రీనివాస్ మాట్లాడుతూ రక్త దానం అనేది మరొకరికి ప్రాణదానం లాంటిదని, రక్తదానం చేసిన ప్రతిసారి మూడు ప్రాణాలను కాపాడటమే కాదు, దాత యొక్క ఆరోగ్యాన్ని కూడా మెరుగు పడుతుంది. రక్తదానం వలన మరొ కరి ప్రాణాలను కాపాడిన వారు మాత్రమేకాక, వారు దృష్టిలో సూపర్ హెరో అవుతారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ హనుమంతరావు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, మారుతీ, ఎల్లాజీ, కుడితి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లో కార్డు జారీ...



కంచరపాలెం : దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లో కార్డు జారీచేస్తామని వై.ఎస్.ఆర్.సి.పి కార్పొరేటర్ అభ్యర్థి వావిలపల్లి ప్రసాద్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న పది రోజుల వ్యవధిలో అర్హులకు బియ్యం కార్డు జారీ కానుందన్నారు. బియ్యం కార్డుల తోపాటు కుటుంబ విభజిత కార్డు, కార్డు నుంచి కుటుంబ సభ్యుల పేర్లు తొలిగింపు, జత చేయడం, సరెండర్ ఇలా ఐదు రకాల సేవలు గ్రామ/వార్డు సచివాలయాల్లో అందుబాటులోకి రానున్నాయని తెలిపిన వావిలపల్లి ప్రసాద్. సంక్షేమ పథకాల అమలు సరికొత్త ఒరవడి సృష్టిస్తున్న జగనన్న ప్రభుత్వం పై ప్రశంశల జల్లు కురిపించారు. పది రోజుల్లో బియ్యం కార్డు,పది రోజుల్లో పెన్షన్ కార్డ్, ఇరవై రోజుల్లో ఆరోగ్యశ్రీ కార్డు,90 రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించి అక్కచెల్లెమ్మల చేతికి ఇళ్ల పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు.



పద్మనాభం మండలం మద్ది గ్రామం లో రైతుభరోసా కేంద్రానికి శంకుస్థాపన చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

## వైద్యుల సేవలు వెల కట్టలేనివి : అవినాష్‌రెడ్డి

వైఎస్సార్ జిల్లా: కరోనా వ్యాప్తి నివారణలో వైద్యుల సేవలు వెల కట్టలేనివని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం లీగల్ అవేర్‌నెస్ డవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధి పెనుబాల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కడప రిమ్స్ ఆసుపత్రిలో వైద్యులకు, సిబ్బందికి పీపీఈ కిట్లు, శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశారు. సుమారు 11 లక్షల విలువైన సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మాజీ మేయర్ సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సేవాభావంతో ముందుకొచ్చి వైద్యులకు కిట్లను అందజేయడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రంలో నూతనంగా 16 మెడికల్ కళాశాలల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని పరికరాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



89వవార్డ్ క్రొత్తపాలెం భగత్‌సింగ్‌నగర్‌లో వున్న శ్రీశ్రీశ్రీ ధారమాంబ అమ్మవారిని దర్శించుకున్న విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు పి.గణబాబు మరియు టీడీపీ వార్డు నాయకులు దాడి వెంకట రమేష్, విజయ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## సింహాచలం దేవస్థానం నూతన ఈఓ గా భ్రమరాంబ

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి సింహాచలం దేవస్థానం నూతన ఈ ఓ గా శ్రీమతి డీ బ్రమరాంబ గారిని నియమిస్తూ మంగళవారంనాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జే ఎస్ వి ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు ఇటీవల ఈ ఓ ఎం వేంకటేశ్వర రావు పై పలు ఆరోపణలు నేపథ్యంలో ఆయనను మాత్రు సంస్థకు అటాచ్ చేస్తూ నూతన ఈ ఓ గా బ్రామరాంబ ని నియమించారు గతంలో ఆమె సింహాచలం దేవస్థానం ఈ ఓ గా పనిచేసిన అనుభవం కలదు

### మున్సిపల్ శాఖ సేవలు

## సచివాలయం నుండి మాత్రమే ప్రజలు పొందాలి

విశాఖపట్నం : రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలలోను/కార్పొరేషన్లలోనూ సేవలను ఆయా ప్రాంతాలలోగల జనులు, వార్డు సచివాలయాల ద్వారా మాత్రమే పొందాలని సి.డి.ఎం.ఏ. విజయ కుమార్ ప్రజలకు పిలుపు ఇచ్చారు. అధికార వికేంద్రీ కరణలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వార్డు సచివాలయాలు ద్వారా సేవలు ప్రజలకు అందించాలని, స్పందన కార్య క్రమంలో, ప్రజల వ్యధలను మాత్రమే స్వీకరిం చాలన్నారు. మున్సిపల్ డైరెక్టరేట్ అధికారులతో ఇంజినీర్-ఇన్-ఛార్జ్‌తో కలిసి అమరావతి నుండి రాష్ట్రంలోగల అందరు మున్సిపల్ / కార్పొరేషన్ కమీషనర్లుతో కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. సి.డి.ఎం.ఏ. విజయ కుమార్ మాట్లాడుతూ , పట్టణ ప్రాంతాలలో నెలకొల్పే ఆరోగ్య కేంద్రములు ప్రజలు 10-15 నిమిషములలోపు చేరే కాలపరిధిలో ఏర్పాటు చేయాలన్నారు. వేసవి ఎద్దడి తీర్చడము కోసం ఖర్చుచేసిన మొత్తాలకు కమీషనర్లు బిల్లులు సమర్పించాలన్నారు. రాబోతున్న వర్షాకాల ప్రభావం వలన, వచ్చే వ్యాధులపైనా, కరోనా వైరస్ పైన, సచివాలయం పరిధిలోగల ప్రజలకు వార్డు కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, ఆరోగ్య విభాగపు సిబ్బంది ద్వారా పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా, వయసు నిండిన వారు పైన, చిన్న పిల్లల పైన, పెక్కు రోగాలతో బాధపడుతున్న వారి పైన దృష్టి సారించాలన్నారు. వీధి దీపాలు నూరు శాతం వెలిగేందుకుగాను ఇ.ఇ. ఎఫ్.సి.ఎల్. అధికారులతోను సహకరించు కొని, సమస్యలుంటే పరిష్కరించుకోవాలన్నారు. గృహ సముదాయాలనుండి చెత్తను సేకరించేందుకు చేపట్టిన ఓ.డబ్ల్యూ.ఎం.ఎస్. సాంకేతిక విధానాన్ని సక్రంగా నిర్వర్తించేందుకు గాను సంస్థతో అధికారులు చర్చించాలన్నారు. ఇంజినీర్- ఇన్-చీఫ్ మాట్లాడుతూ, నాడు - నేడు పథకంలో చేపడుతున్న వివిధ పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయాలన్నారు. జి.వి.ఎం.సి. కమీషనర్ మాట్లాడుతూ, పౌర సేవలు వార్డు సచివాలయాలు ద్వారా ప్రజలకు అందించేందుకు ఇప్పటికే తగు చర్యలు చేపట్టామన్నారు. నగర పరిధిలో నిబంధనలకు అనుగుణంగా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. నాడు - నేడు పథకం క్రింద పాఠశాలలో చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తామన్నారు. సీజనల్ వ్యాధులపై, కరోనా వైరస్ నియంత్రణపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించేందుకు తగు చర్యలు చేపట్టామన్నారు. మొబైల్ బృందాల ద్వారా కంటైన్మెంట్ జోన్ల పరిధిలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. నూరు శాతం వీధి దీపాలు వెలుగు నింపేందుకు, చెత్త సేకరణ ఓ.డబ్ల్యూ.ఎం.ఎస్. విధానం ద్వారా సక్రమంగా నిర్వహించేందుకు గాను అధికారులను ఆదేశించామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అమరావతి నుండి. సి.డి.ఎం.ఏ. విజయ కుమార్ తో పాటు ఇంజినీర్-ఇన్-చీఫ్ చంద్రయ్య, అదనపు డైరెక్టర్ ఆశా జ్యోతి, ఇతర డైరెక్టరేట్ అధికారులు, టెడ్కో అధికార్లు పాల్గొనగా జి.వి.ఎం.సి. కమీషనర్ తో పాటు అధనపు కమీషనర్లు చీఫ్ ఇంజినీర్, ప్రధాన ఆరోగ్య శాఖ అధికారి, యూ.సి.డి. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస రావు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, పర్యవేక్ష ఇంజినీర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## దౌత్యంతోనే చైనా కట్టడి

సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తత ఘర్షణగా మారకుండా జాగ్రత్తపడాలనే ధోరణిని భారత్, చైనా దేశాలు రెండూ ప్రదర్శించడం హర్షణీయం. వాస్తవాధీన రేఖ దగ్గర రెండు దేశాల సైన్యాలు మోహరించి ఉన్నాయి. రెండు దేశాల విదేశాంగ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు పంచుకున్నారు. ఆ తరువాత ఇరు దేశాల ఉన్నత స్థాయి సైనికాధికారులు పరిస్థితిని సమీక్షించారు. పరిస్థితిలో మార్పు లేనప్పటికీ సుహృద్భావాన్ని నెలకొల్పాలనే దృఢ నిశ్చయాన్ని రెండు దేశాలు వ్యక్తం చేశాయి. రెండు పక్షాలు సైనిక, దౌత్య మార్గాల ద్వారా చర్చలు జరిపి సరిహద్దులో శాంతిని నెలకొల్పుతాయని భారత విదేశాంగ శాఖ ఆదివారం ప్రకటించింది. చైనా నుంచి కూడా సోమవారం ఇటువంటి సానుకూల ప్రకటనే వెలువడింది. అయితే ఇటువంటి అంశాలు వెంటనే తేలవనీ, కొన్ని నెలలపాటు చర్చలు కొనసాగుతాయని విదేశాంగ వర్గాలు అంటున్నాయి.

చైనాతో సరిహద్దు ప్రాంతంలోని కొన్ని చోట్ల రెండు వైపులా సైనిక మోహరింపులతో ఉద్రిక్తత నెలకొన్నది. లడాఖ్ తూర్పు ప్రాంతంలో నాలుగు చోట్ల, గాల్వాన్ లోయ ప్రాంతంలో మూడు చోట్ల, పాంగ్‌కాంగ్ సరస్సు దగ్గర ఒకచోట చైనా తమ సైనికులను భారీ ఎత్తున మోహరించింది. ఇందుకు దీటుగా భారత్ కూడా ఎత్తైన ప్రాంతాల్లో యుద్ధం చేయగలిగే దళాలను వాస్తవాధీన రేఖ సమీపానికి తరలించింది. రేఖకు అవతలి వైపున చైనా సైనిక శిబిరాలకు అన్నిటికీ పటిష్ఠమైన రహదారి సౌకర్యం ఉన్నది. ఇవతలి వైపున భారత్ కూడా అదే రీతిలో రహదారులను నిర్మిస్తుండటంతో, చైనా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నది. సైనిక బలగాలను తరలించి బల ప్రదర్శనలు చేస్తున్నది. గత నెల ఐదు-ఆరవ తేదీ ప్రాంతంలో ఇరు దేశాల బలగాల మధ్య చిన్న ఘర్షణ కూడా జరిగింది. అయితే రెండు వైపులా సైన్యాలు ఘర్షణ పెరగకుండా సంయమనం పాటించాయని తెలుస్తున్నది.

తైవాన్, దక్షిణ చైనా సముద్రం, రష్యా, జపాన్, భారత్‌తో సరిహద్దు విభేదాలు, అమెరికాతో వాణిజ్యం- మొదలైన ఏ వివాదంలోనైనా చైనా ఎదుటి పక్షం బలబలాలు, లాభనష్టాలు, సందర్భాలను బట్టి కచ్చితమైన అంచనాతో వ్యవహరిస్తుంది. మన దేశం కూడా చైనాతో వ్యవహరించడంలో అసాధారణ దౌత్యనీతిని ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ కాలంలో సైనిక బలాన్ని మాత్రమే నమ్ముకునే పరిస్థితి లేదు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నది. జపాన్, ఆస్ట్రేలియాతో సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నది. అమెరికాతో కూడా సన్నిహితంగా ఉంది. మన దేశంలో చైనాకు వాణిజ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని వివిధ వ్యూహాలతో చైనాను కట్టడి చేయాలి. 1962 నాటి పరిస్థితి ఇప్పుడు లేదని చైనాకు అర్థం చేయించాలి. వాస్తవాధీన రేఖ ప్రాంతంలో యథాతథ స్థితి కొనసాగాలన్న భారత్ వాదన సమంజసమైనది. బలమైన పొరుగు దేశంతో యుద్ధానికి దిగాలన్న భావన భారత్‌కు ఎప్పుడూ లేదు. అయినా చొరబాట్లను సహించదనేది స్పష్టం.

## నేటి నుంచి డిగ్రీ జవాబుపత్రాల మూల్యాంకనం

### ఉపకులపతి ఆచార్య డా. కూన రామ్‌జీ

శ్రీకాకుళం : డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల చివరి సంవత్సరం విద్యార్థుల పరీక్షల మూల్యాంకనం ఈ నెల 10వ తేదీ (నేటి నుంచి) ఆరు కేంద్రాల్లో ప్రారంభమవుతుందని ఉపకులపతి ఆచార్య డా.కూన రామ్‌జీ అన్నారు. విశ్వవిద్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ తృతీయ సంవత్సరం ఆరో సెమిస్టరు, ఏడాది కాలవ్యవధి గల విద్యార్థులు మొత్తం దాదాపు 15 వేల మందికి సంబంధించి 90 వేల జవాబు పత్రాల మూల్యాంకనం వారం రోజుల్లో పూర్తిచేసి నెలాఖరునాటికి ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఫలితాలొచ్చిన వారం రోజుల్లో ఇన్‌స్టెంట్‌పరీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషులు, మహిళా డిగ్రీ కళాశాలలు, మునసబుపేటలోని గురజాడ కళాశాల, రాజాంలోని జీసీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల, టెక్కలి, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మూల్యాంకనం జరుగుతుందన్నారు. డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు జులై మొదటి వారంలో ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో నిర్వహించి ఆ నెలా ఖరుకు ఫలితాలు విడుదల చేస్తామన్నారు. పీజీ రెండో సెమిస్టర్ జులై మొదటి వారం, నాలుగో సెమిస్టర్ మూడో వారంలో నిర్వహిం చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రెగ్యులర్ బోధన సిబ్బంది పోస్టులు 60 ఉండగా...10 మంది, రెగ్యులర్ బోధనేతర సిబ్బంది పోస్టులు 81కి గానూ అయిదుగురు మాత్రమే పని చేస్తున్నారు.

# అమెరికా తర్వాత భారత్‌లోనే 'సీరియస్'!



దిల్లీ : కొవిడ్ విజృంభణ భారత్‌లో కొనసాగుతూనే ఉంది. ఏ రోజుకారోజూ అత్యధిక కేసులు నమోదవుతూ ఆందోళనకర స్థాయికి చేరుతోంది. గడచిన 24 గంటల్లో 9987 కేసుల నమోదు ఓ రికార్డు కాగా... 331 మంది మృత్యువాత పడ్డారు. దీనితో దేశంలో కరోనా వైరస్ మరణాల సంఖ్య 7,476కు చేరింది. మొత్తం 2,66,598 కేసులతో అంతర్జాతీయంగా ఐదో స్థానంలో ఉన్న భారత్... ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న కరోనా బాధితుల సంఖ్యలో రెండో స్థానంలో ఉండటం గమనార్హం. కొవిడ్-19కు సంబంధించి అంతర్జాతీయ గణాంకాల సంస్థ 'వరల్డోమీటర్' వివరాల ప్రకారం... విషమంగా ఉన్న కరోనా బాధితుల సంఖ్య పరంగా అమెరికా (16,907) తొలి స్థానంలో ఉండగా... 8,944 కేసులున్న భారత్‌దే ద్వితీయ స్థానం. కరోనా హాట్‌స్పాట్‌గా ఉన్న బ్రెజిల్‌లో కేసులు భారత్‌కంటే మూడురెట్లు అధికమైనప్పటికీ... సీరియస్ కేసులు మన కంటే తక్కువగా ఉన్నాయి. ఇక రష్యాలో సీరియస్ కేసుల సంఖ్య భారత్‌లో నాలుగో వంతుగా ఉంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయానికి దేశవ్యాప్త కొవిడ్-19 కేసుల సంఖ్య 2,66,598 కాగా.. కరోనా మృతుల సంఖ్య ఐదు శాతం కంటే తక్కువేనని చెప్పింది. ఇక ఐసీయూలో ఉన్న బాధితులు 2.25 శాతం కాగా... 1.91 శాతం మందికి ఆక్సిజన్ సహాయం అందిస్తున్నామని వివరించింది. కరోనా కేసుల్లో అధిక భాగం మహారాష్ట్ర, దిల్లీ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచే ఉన్నాయని ఆరోగ్యశాఖ వివరించింది.

# తమిళనాడులోనూ పదో తరగతి పరీక్షలు రద్దు



చెన్నై : రాష్ట్రంలో కరోనా మహమ్మారి విజృంభిస్తున్న కారణంగా పదో తరగతి పరీక్షలను రద్దు చేస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రకటించారు. విద్యార్థులందరినీ పై తరగతులకు ప్రమోట్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో ఆ రాష్ట్రంలో చదువుతున్న 9 లక్షల మంది విద్యార్థులకు పరీక్షల నుంచి ఉపశమనం లభించినట్లయింది. అలాగే క్లాస్ 11 తరగతుల పరీక్షలు కూడా రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. 'విద్యార్థుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని పదో తరగతి తరగతి పరీక్షలను రద్దు చేస్తున్నాం. పరీక్షలు నిర్వహించకుండానే పై తరగతులకు ప్రమోట్ చేస్తున్నాం. క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా 80శాతం మార్కులు, హాజరు ఆధారంగా 20శాతం మార్కులు లెక్కగడతామని' ముఖ్యమంత్రి వెల్లడించారు. తొలుత జూన్ 15 నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. అయితే కొవిడ్ విజృంభణను దృష్టిలో పెట్టుకుని పరీక్షల నిర్వహణ వాయిదాను పరిశీలించాలని మద్రాస్ హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ నిపుణులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఇప్పట్లో వైరస్ తగ్గుముఖం పట్టే అవకాశాలు లేవని వారు స్పష్టం చేయడంతో ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చింది. పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవడాన్ని తమిళనాడులో ప్రతిపక్షాలు కూడా తీవ్రంగా తప్పుపట్టాయి. సోమవారం డీఎంకే నేత ఎంకే స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ మోడల్ తరహాలో ఇక్కడి విద్యార్థులను కూడా పరీక్షలు లేకుండానే పాస్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. '3,650 కేసులున్న తెలంగాణలోనే పరీక్షలు రద్దు చేసినప్పుడు. 33,229 కేసులున్న తమిళనాడులో పరీక్షలను నిలిపివేయడమే సముచితమని' స్టాలిన్ అభిప్రాయపడ్డారు.

**పుదుచ్చేరిలో కూడా..**

తమిళనాడుతో పాటు పుదుచ్చేరిలోనూ పదో తరగతి పరీక్షలను రద్దు చేశారు. అక్కడ కూడా పదో తరగతి విద్యార్థులను నేరుగా పై తరగతులకు ప్రమోట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ప్రభుత్వ అవుట్‌లెట్ల ద్వారానే మద్యం విక్రయాలు



అమరావతి: బార్‌లలో మద్యం, బీర్ విక్రయాలకు అనుమతి లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. బార్‌లు, రెస్టారెంట్లలోని మద్యం బాటిళ్లను ప్రభుత్వ అవుట్ లెట్‌లకు తరలించి విక్రయించుకునేందుకు అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, కేవలం సీల్డ్ బాటిళ్లను మాత్రమే విక్రయించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. లాక్‌డౌన్ కారణంగా సుదీర్ఘకాలంపాటు బార్‌లు మూసివేసి ఉన్నందున బీర్ బాటిళ్ల కాలపరిమితి ముగిసిపోయే అవకాశం ఉందని.. వాటిని విక్రయించేందుకు అవకాశం కల్పించాలని ఏపీ వైన్ డీలర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది.

దీనిపై స్పందించిన సర్కార్ ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న అవుట్ లెట్ల ద్వారా విక్రయాలు జరిపేందుకు అనుమతి ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. మద్యం, బీర్ విక్రయాలపై హోల్‌సేల్ ధర మాత్రమే బార్ యజమానులకు చెల్లింపు ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# జైపూర్‌లో మహమ్మారి పంజా

### ఒకే ఇంట 26 మందికి కోవిడ్-19

జైపూర్ : రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన 26 మందికి కరోనా వైరస్ పాజిటివ్‌గా తేలింది. ఏడు రోజుల కిందట ఓ వ్యక్తికి కోవిడ్-19 పాజిటివ్ రిపోర్ట్ రాగా, ఆ కుటుంబంలోని 25 మందికి నిర్వహించిన కరోనా వైరస్ పరీక్షలో పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని అధికారులు వెల్లడించారు. 'వారి నుంచి సేకరించిన శాంపిళ్లను పరీక్షించగా గత రాత్రే రిపోర్టులు వచ్చాయని, వారందరికీ పాజిటివ్‌గా తేలిందని..వారందరినీ ఆస్పత్రికి తరలించామ'ని వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరోత్తమ్ శర్మ వెల్లడించారు. కరోనా బారిన పడిన ఒకే కుటుంబంలోని వీరంతా జైపూర్‌లోని సుభాష్ చౌక్ ప్రాంతానికి చెందిన వారని అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లో అత్యధిక కరోనా కేసులు నమోదవుతున్న నగరం జైపూర్ కావడం గమనార్హం. జైపూర్ తర్వాత ఎడ్యుకేషన్ హబ్‌గా పేరొందిన కోట, జోథ్‌పూర్ నగరాలు కరోనా హాట్‌స్పాట్‌లుగా మారాయి.

## కవి సమయం

### ప్రేమను ప్రేమతో బ్రతికించండి

గెలిచినప్పుడు 'జ్ఞాపకాలు' మిగులుతాయి!
ఓడినప్పుడు 'అనుభవాలు' మిగులుతాయి!
కాని, గెలుస్తామో, ఓడుతామో తెలియని,
'ప్రేమలో' పడితే కన్నీళ్ళే మిగులుతాయి!
తెలియని బంధం, తెలివిగా చుట్టుకుంటుంది!
అందాన్నిఆరాదించాలేగాని, అనుభవించడానికి చూడకూడదు!
ఆడదాని మనసు అరిటాకువంటిది!
'ప్రేమ' మనస్సులో ఒక్కసారే పుడుతుంది!
'ప్రేమ' ప్రేమను గెలిపిస్తుందంటారు!
నిస్వార్థమైన ప్రేమలు నిలువుటద్దాలకు సాక్ష్యాలు!
మగవాళ్ళ ప్రేమలో స్వార్థము ఉంటుంది!
ఆడదాని ప్రేమ స్వార్థరహితంగా ఉంటుంది!
అందుకే ప్రేమ సాగరములో మునిగే,
యువతీ యువకుల్లారా!
మిమ్మల్ని మీరు 'ప్రేమ' ముసుగుల్లో మునిగిపోకుండా,
'ప్రేమ'ను 'ప్రేమతో' బ్రతికించండి!

రచయిత : వేగి నూకరాజు

# పంచాంగం

మాసం : జ్యేష్ఠ; తిథి: పంచమి రా.9.42; శ్రవణం సా.4.57; రా.వ.9.10ల 10.52.

బుధవారం 10-06-2020

**మేషం** : బ్యాంకు వ్యవహారాలు, ప్రయాణాల్లో మెలకువ వహించండి. ఎదుటి వారితో సంభాషించేటపుడు మెలకువ వహించండి. రాజకీయనాయకుల కదలికలపై విద్రోహులు కన్నేసిన విషయం గమనించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది.

**వృషభం** : విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారులకు ఆటుపోట్లు తప్పవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. స్త్రీలు ఇతరులతో మితంగా సంభాషించటం క్షేమ దాయకం. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి.

**మిథునం** : మీ సంతానం పరీక్షల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆడిటర్లకు ఒత్తిడి, కాంట్రాక్టర్లకు లాభదాయకం. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచి కేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. బంధువుల మధ్య సయోధ్య నెలకొంటుంది.

**కర్కాటకం** : దంపతుల మధ్య సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు పోకుండా ఏకాగ్రతతో పని చేయవలసి ఉంటుంది. స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యో గులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

**సింహం** : విద్యార్థులకు ఏకాగ్రత వల్ల అభివృద్ధి పొందగలుగుతారు. కొత్త సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. మెళుకువ వహించండి. మీ మాటకు సంఘం లోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**కన్య** : స్త్రీలతో సంభాషించునపుడు సంయమనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు

**తుల** : కాంట్రాక్టర్లకు రావలసిన ధనం అందడంతో నిర్మాణ పనులు వేగవంతమవుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర్రతా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరులకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి. దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం** : ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యో గస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది.

**ధనుస్సు** : ప్రేమికులకు పెద్దల నుండి వ్యతిరేకత, ఇతర్రతా చికాకులు అధికమవుతాయి. కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. గృహంలో మార్పులు, చేర్పులకై చేయు యత్నాలు ఫలిస్తాయి.

**మకరం** : ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు. స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం. చిరు వ్యాపారులకు చికాకులు తప్పవు. బంధువుల రాకపోకలు అధికమవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు.

**కుంభం** : స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్యలెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాల్లో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు. విదేశీ యత్నాలు వాయిదాపడతాయి. వృత్తి వ్యాపారాలు అనుకూలించి ననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు కలుగును.

**మీనం** : వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయంకృషినే నమ్ముకోవడం మంచిది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు

# కష్టాలను తీర్చే శ్రీ జగదాంబ మాత

## సంకీర్తన



మహారాష్ట్రలోని అత్యంత ప్రసిద్ధి గాంచిన ఒక పుణ్య స్థలాన్ని మీకు పరిచయం చేస్తున్నాం. మహారాష్ట్రలో ఉన్న ముఖ్యమైన పట్టణాల్లో ఒకటైన అహ్మద్‌నగర్‌కు సమీపంలోని మోహాదే అనే ప్రాంతం ఉంది. ఇక్కడ శ్రీ జగదాంబ మాతా ఆలయం ఉంది.

ఈ మాతను దర్శించు కునే భక్తులకు కోరిన కోర్కెలు, కష్టాలు తీరుతాయని బలమైన విశ్వాసం.

ఈ ఆలయం ఇక్కడ వెలిసేందుకు ఒక భక్తుడే ప్రధాన కారణం. అతని పేరే.. బన్సీ దహిఫలే. శక్తిపీఠాల్లో ఒకటైన మాహుర్ఘర్ అనే ప్రాంతంలో వెలసిన రేణుకా మాతకు తీవ్ర భక్తుడు. ప్రతిసారి అక్కడకు వెళ్లే భక్తుడు తమ గ్రామానికి వచ్చి వెలియాల్సిందిగా ప్రార్థించేవాడు.

ఆయన కోర్కె ప్రకారం ఒక రోజు దహిఫలే కలలోకి వచ్చిన రేణుకా మాత.. ఆ గ్రామంలోని కొండ శిఖరంపై వెలసివున్నట్టు చెప్పింది. అప్పటి నుంచి భక్తుడు అక్కడకు వెళ్లి పూజలు చేసి, ప్రార్థినలు చేయసాగాడు. రేణుక మాత మరో రూపమే శ్రీ జగదాంబ మాత పేరుగాంచింది. గురు రిషేదర్, గురు మచేంద్రనాథ్, కానిఫ్ నాథ్, కాహినాథ్, జాలింగర్ నాథ్ నాగనాథ్ అనే ప్రముఖులు ఈ ఆలయానికి వచ్చి ాతను దర్శించుకున్నారు. ఆశ్వని నక్షత్రం, ఏకాదశి రోజున శ్రీ జగదాంబ మాతకు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఆలయంలో లిఖించిన శిలాఫలకాలపై శ్రీజగదాంబ మాత తన శక్తిపీఠం వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఆలయానికి సమీపంలో శివాలయం ఉంది.

దీనికి ఆనుకుని ఉన్న కోనేరులో పుణ్యస్నానం చేసిన తర్వాతే శ్రీ జగదాంబ మాతను దర్శనం చేసుకుమని భక్తులు చెపుతుంటారు.



# కొయ్యూరులో మన్యం బంద్ విజయవంతం


బంద్ చేపడుతున్న దృశ్యం

కొయ్యూరు : జిఒ నెంబరు 3ని పటిష్టంగా అమలు చేయాలని పిలుపునిచ్చిన మన్యం బంద్ కొయ్యూరు మండలంలో విజయవంతమైంది. దీనిలో భాగంగా గిరిజన సంఘం నాయకులు ఉదయం నుంచి బంద్ నిర్వహించారు. దుకాణాదారులు స్వచ్ఛంధంగా మూసివేశారు. జిఒ నెంబరు 3 రక్షణకై ప్రభుత్వాలు సుప్రింకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సలహా మండలి(టిఎసి)లో చర్చించి 100 శాతం ఎస్టీ ఉద్యోగ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఏజెన్సీలో ఉన్న ప్రతీ శాఖలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టులు స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలన్నారు.

ప్రైవేటు రంగంలో ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఐటిడిఎలో ఉద్యోగాల స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎస్.సూరిబాబు, జెఎసి నాయకులు ఎం.బూరుగులయ్య, గూడెం లక్ష్మణ్, గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు సీదరి సన్యాసిరావు, నర్సి పాపారావు, వివిధ పార్టీల నాయకులు బడుగు రమేష్, బల్ల ప్రసాద్, గోకిరి చిన్నారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పణ



గాజువాక : గాజువాక స్పందన కార్యక్రమంలో భాగంగా జివియంసి పరిధి అయిన 76వ వార్డు గ్రామ ప్రజలు తరపున వార్డు వైఎస్ఆర్ సీపీ అభ్యర్థి దొడ్డి రమణ జోన్-5 కమిషనర్ శ్రీధర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రామచంద్ర నగర్ లో డ్రైనేజీ వ్యవస్థ చాలా దుర్భర పరిస్థితిలో ఉందని దానివల్ల వర్షం పడే సమయంలో నీరు ఇంట్లోకి వెళ్లిపోవడం వల్ల చాలా సమస్యలు తలెత్తుతున్నాయని , అలాగే పిల్లలు చదువుకునే అంగన్వాడి స్కూల్ పక్కన ఖాళీ స్థలం ఉండడంవల్ల అక్కడ పందులు నివాస స్థలంగా ఏర్పరచు కోవడం వల్ల దోమలు, ఈగలు సమస్య చాలా తీవ్రంగా ఉండడంతో పిల్లలు , పెద్దలు అనారోగ్యం బారిన పడటమే కాకుండా అటుగా వెళ్లే ప్రజలు దుర్వాసనతో చాలా నరకయాతన పడుతున్నారని అన్నారు. దీనిపైన స్పందించిన కమీషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్పు పూడి పరదేశి,పిట్ట రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ బ్రహ్మానంద రెడ్డి, ఎం ప్రసాద్, భీమా రెడ్డి, కె రమేష్, నాగు, అండి బోయిన సన్నీ, గణేష్, వార చైతన్య, గురుమూర్తి, ప్రసాద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలల్లో గ్రామాల్లో
# చెత్త కుప్పలు లేకుండా చర్యలు చేపడతాం : ఎంపీడీవో

**గ్రామ వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులుకు వేములపూడి, చెట్టుపల్లి లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం**




నర్సీపట్నం : ఆరు నెలల కాలంలో గ్రామాల్లో చెత్త కుప్పలు లేకుండా చర్యలు చేపడతామని నర్సీపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణీ యన్. జయమాధవి విలేకరులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని వేములపూడి చెట్టుపల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నుకోవడం జరిగింది అన్నారు. ఈ గ్రామాల్లో ఉన్న మొత్తం చెత్తను తడి చెత్త, పొడి చెత్త గా విభజన చేసి వాటి ద్వారా వ్యవసాయానికి ఉపయోగపడే సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. దీనికోసం ఇప్పటికే విశాఖ జిల్లా కేంద్రం నుండి వచ్చిన మాస్టర్ ట్రైనీ గ్రామ వాలంటీర్లకు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారన్నారు. సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ ఈవోపిఆర్డీ సి. హెచ్ ప్రేమలీల, కార్యాలయ సిబ్బంది నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 16 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు



దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఆరోగ్య వైద్య ప్రసూతి కేంద్రంలో 16 మంది గర్భిణీ స్త్రీ లకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి ఎస్.లలితా తెలిపారు. దేవరాపల్లి పిహెచ్ సి పరిధిలోని 70 మంది గర్భిణీలు ఉండగా అందులో కోవిద్ 19 కారణంగా 16 మందికి మాత్రమే మంగళవారం ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద వైద్య పరీక్షలు జరిపామన్నారు. వీరిలో 4 కేసులను అత్యవసరంగా గుర్తించి కె. కోటపాడు ఆసుపత్రి కి తరలించామన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లా డుతూ కరోనా కారణంగా గర్భిణీలు వ్యక్తిగత శుభ్రతతో పాటు కసి చల్లార్చిన నీరు తాగాలన్నారు. మండల ప్రజలు తప్పని సరిగా మాస్కులు, శానిటేషన్, భౌతికదూరం పాటించాలన్నారు.

# మంచి పరిపాలనాధక్షుడు సిఎం జగన్మోహనరెడ్డి

## - ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి : రాష్ట్రంలో మంచి పరిపాలనాదక్షుడుగా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి పని చేస్తున్నారని ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని కొత్తపెంట గ్రామంలో ఆటో డ్రైవర్లుకు 10 వేలు వేసిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆటో డ్రైవర్ లతో కలిసి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో 90 శాతం హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వై.సి.పి నాయకులు కర్రి సత్యం, నీలిమ వెంకటరావు, రొంగలి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ హైర్‌బస్ కార్మికులకు లాక్‌డౌన్ కాలానికి జీతాలు
## చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలి



విశాఖపట్నం : ఏపీయస్ఆర్టీసీలో పనిచేస్తున్న అద్దె బస్ డ్రైవర్స్ అందరికి లాక్ డౌన్ కాలానికి (ఏప్రిల్-మే నెలల) జీతాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి. కుమార్ మాట్లాడుతూ విశాఖ లో 450 మంది అద్దె బస్ డ్రైవర్స్ వివిధ డిపోలలో పనిచేస్తున్నారని వీరికి ప్రభుత్వం కనీసవేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ లాంటివి ఏమీ అమలుకావడం లేదన్నారు. లాక్ డౌన్ వల్ల బస్ లు తిరగక గత 2 నెలలనుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని వీరందరికి జీతాలు చెల్లించాలన్నారు. జీతాలు లేకపోవడంతో ఇళ్ల అద్దెలు,పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక నానా అవస్థలు పడు తున్నారని వెంటనే జీతాలు చెల్లించే విధంగా అద్దె బస్ యాజమాన్యాలను ఆదేశించాలన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు శివ,జానకిరామ్,శంకర్,అర్జున్,రవిశంకర్ లతో పాటు అద్దెబస్ డ్రైవర్స్ పాల్గొన్నారు.

# సొంత నిధులతో 24వ వార్డ్ లో బోరు తవ్వించిన శివప్రసాద్

**ఐక్యంగా రుణపడి ఉంటామని వెల్లడించిన 24వవార్డు మహిళలు, వైఎస్ఆర్సీపీ యూత్, ధనిమిరెడ్డి ప్రసాద్**


24వవార్డు చాకలి పేటలో బోధిస్తున్న ఏకా శివప్రసాద్ తదితరులు

నర్సీపట్నం : ఎన్నికల కంటే ముందే ప్రజల అవసరాలను గుర్తించి తీర్చిన వాడే నిజమైన ప్రజా నాయకుడు అని 24 వ వార్డు మహిళాలోకం తెలిపింది. మంగళవారం వార్డులోని చాకలి పేటలో 24 వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థి ఏక్ శివప్రసాద్ తన స్వంత నిధులతో సుమారు 60,000 వెచ్చించి బోరును తవ్వించారు. దీంతో మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా పాలకులు ఈ బోరు వేయడానికి ఎన్నో మాయమాటలు చెప్పారన్నారు. శంకుస్థాపనలు చేశారు, చాలా సార్లు కొబ్బరికాయలు కొట్టారు, అయినా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. తమ పాలిట ప్రసాదం లా ముందుకొచ్చి మంచి నీటి బోరు తవ్వించడం ఎంతో ఆనందంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏక్ రాజుబాబు, విశాఖ డైరీ డైరెక్టర్ సూర్యనారాయణ, ధనిమిరెడ్డి ప్రసాద్, వైఎస్ఆర్సిపి యూత్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మన్యం బంద్ సంపూర్ణం ?



అరకు లోయ. జీవో నెంబర్ 3 రద్దుకు నిరసనగా వివిధ గిరిజన సంఘాలు మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచే అరకులోయ మండల కేంద్రంలో ప్రశాంతంగా ప్రారంభమైంది.

గిరిజన సంఘాలు ఉపాధ్యాయ సంఘాలు నాయకులు మండల కేంద్రంలోని ప్రధాన రహ దారిలో సామాజిక దూరం పాటిస్తూ జీవో నెంబర్ 3 ను పునరుద్ధరిం చాలని నినాదాలు చేశారు ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు గిరిజనులకే కేటాయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల ప్రజా నాయకులు అన్ని ఉద్యోగ సంఘాలు పాల్గొన్నాయి.

## 20 లక్షల విలువ చేసే
# 1010 కేజీల గంజాయి స్వాధీనం : ఇద్దరు అరెస్టు


గంజాయి నిందితులతో పోలీసులు

కొయ్యూరు : కొయ్యూరు మండలం డౌనూరు చెక్‌పోస్ట్ వద్ద కొయ్యూరు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో చింతపల్లి నుండి వస్తున్న ఏపి 37 టిడి 6839 నెంబరు గల లారీలో 1010 కేజీల గంజాయి స్వాదీనం చేసుకున్నామని కొయ్యూరు సిఐ వెంకటరమణ తెలిపారు. గంజాయితో పాటు జికెవీధి మండలం పెద్దగొంది గ్రామానికి చెందిన పాంగి రాజు(20), ఒరిస్సాకు చెందిన అజయ్‌ప్రకాష్‌దుచా(37)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 20 లక్షలు ఉంటుందని సిఐ తెలిపారు. ఈ దాడుల్లో కొయ్యూరు ఎస్సై దాసరి నాగేంద్ర, మంప ఎస్సై సన్నిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు తనిఖీ


టెక్నికల్ అసిస్టెంట్ బూరు సింహాచలంనకు సూచనలిస్తున్న అనంతగిరి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి యు. కూర్మారావు

అనంతగిరి : అనంతగిరి మండలంలోని చిలకలగెడ్డ, వెంకయ్యపాలెం,దంసరాయి,తుమ్మానవలస, గ్రామాలలో, అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి యు,కూర్మారావు, MGNREGS పనులు సందర్శించి, కూలీల మస్టర్ లు తనిఖీ చేయడం జరిగింది. కోవిడ్,19, కరోనా వైరస్ బారిన పడకుండా,తీసుకోవలసిన, జాగ్రత్తలు పై తగు సూచనలు చేశారు, వర్షాలు కారణంగా కాచిన నీల్లుత్రాగాలని అనారోగ్య బారినపడకుండా జాగ్రత్తపడాలని తెలియజేశారు, ఈయనతో పాటుగా టెక్నికల్ అసిస్టెంట్ ,బూరు సింహాచలం, పాల్గొన్నారు,

# కమిషనర్ దేవాలయాలు సందర్శన



కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ కమిషనరు స్వప్నిల్ దిన్ కర్ పుండ్కర్ ఐ.ఏ.ఎస్, వారు మంగళవారం నగరపాలక సంస్థ పరిధిలో నుండి ప్రభుత్వం వారి ఆదేశముల మేరకు తెరచుకొనిన దేవాలయములను సందర్శించినారు. సదరు పర్యటనలో భాగంగా స్థానిక బాలాత్రిపుర సుందరి అమ్మవారి దేవాలయమును సందర్శించి సదరు దేవాలయము నందు దర్శనములను భక్తులు అందరూ సామాజిక దూరం పాటించి చేసుకోనుచున్నారా? లేదా ? అని పరిశీలించి అర్చకులకు, భక్తులకు కూడా నిబద్ధతతో కోవిడ్ -19 నియమాలను తెలిపి వాటిని విధిగా పాటించాలని తెలిపినారు. అదేవిధంగా దేవాలయము సమీపంలో ఉన్న పూజా సామగ్రి దుకాణములు వారు కొబ్బరి కాయలు, ఇతర సామగ్రి అమ్మ కాలు జరుపరాదని, ప్రస్తుతం దేవాల యములలో దర్శనములు మాత్రమే ఉండునని ఎటువంటి తీర్థ, ప్రసాద వితరణ ఉండనందున సదరు దుకాణములను మూయించి వేసినారు. తదుపరి 10వ శానిటరీ సర్కిల్ ప్రాంతం కొత్తపేట చిన మార్కెట్ ఏరియా కామేశ్వరీ నగర్ దగ్గర పారిశుధ్యం పనులు పరిశీలించి అక్కడ సరిగా లేకుండుట గమనించి సంబంధిత సిబ్బందిని మందలించి మధ్యాహ్నా సమయంలో కల్లా సదరు ప్రాంతంను పరిశుభ్ర పరచి తనకు రిపోర్ట్ చేయాలని ఆదేశించినారు. అదేవిదంగా స్థానిక ఆర్.ఆర్.నగర్ ప్రాంతంలో జరుగుచున్న ఉద్యానవన పనులను పరిశీలించి సిబ్బంది త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తిచేయాలని ఆదేశించినారు. అన్ని రకములైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేసి కాకినాడ నగరమునకు మంచిపేరు తీసుకు రావాలని సూచించినారు. ఈ పర్యటనలో కమిషనర్ వారితో పాటు ప్రజారోగ్య విభాగాధికారి పి.ప్రశాంత్ గారు, పారిశుధ్య సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం నుండి సిబ్బంది హాజరు అయినారు.

## తాణాంలో ఫార్మాకెమికల్స్ - గుర్తు తెలియని వ్యక్తులు డంపింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్

పరవాడ : పరవాడ మండలము తాణాం గ్రామంలో వాటర్ ట్యాంక్ వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు సోమవారము రాత్రి ఫార్మా కెమికల్స్ ను రోడ్ల మీద వేశారు. దీంతో కెమికల్స్ వల్ల వచ్చే దుర్వాసనతో

గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు పదులు మందితిరిగి ఈ రోడ్డు మార్గంలో కెమికల్స్ వేయ డములో వలన ఏటువంటి ప్రమాదం జరుగుతాదో అని...

క్షణంక్షణం గ్రామ స్తులు భయాం దోళన చెందుతున్నారు. ఇప్పటి కైనా సంభందిత అధికారులు స్పందించి రోడ్లుపై కెమికల్స్ వేసినవారిపై చర్యలు తీసుకోవాలని స్దానికులు కోరుతున్నారు.

## అనారోగ్యానికి గురైన మల్లిఖార్జునరావుకు యుజిడి కార్మికులు రూ.6,500నగదు అందజేత



విశాఖపట్నం : అండర్ గ్రౌండ్ డ్రైనేజీ జోన్-1లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురైన అలమండ మల్లిఖార్జునరావు అనే కార్మికుడి పక్షవాతం వచ్చి ఎడమకాలు కుడి చేయిపడిపోయింది. యూనియన్ పిలుపు మేరకు ఆ కుటుంబానికి యూజిడి కార్మికులంతా కలిసి రూ.6500/-లు జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నూకరాజు, యూజిడి వర్కర్స్ అధ్యక్షులు ఈ ఆదినారాయణ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా టి.నూకరాజు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా వస్తున్న నగర ప్రజల మలమూత్రాలను ఎత్తి శుభ్రంచేసి ఈ కార్మకుడి కుటుంబాన్ని జివిఎంసి ఆదుకోవాలన్నారు. రూ.12000 రూపాయలతో జీతాలతో విశాఖ పట్నం వంటి నగరాల్లో ఇల్లు అద్దెలు కట్టుకొని ఆ కుటుంబాన్ని పోషించడం చాలా కష్టమౌతుందని వెంటనే యూజిడి కార్మికులకు కూడా పారిశుద్ధ్య కార్మికులవల్లే ఆక్యుపై హెల్త్ అలవెన్సు ఆగస్టు 15 నుంచి ఏరియర్స్‌తోపాటు రూ.18000/-లు జీతాన్ని జివిఎంసి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రమణ, అప్పలరాజు, సన్నిబాబు, రఘు, మహేష్, బంగారయ్య, బాబురావు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్కలి డివిజన్ లో రబీ పంటకు తొలిసారిగా సాగునీరు

శ్రీకాకుళం : టెక్కలి డివిజన్ లో వంశధార ఎడమ ప్రధాన కాలువ క్రింద ఈ ఏడాది రబీ పంటకు సాగు నీటి సరఫరా జరిగిందని బి.ఆర్.ఆర్ వంశధార ప్రాజెక్టు ప్రధాన కాలువల విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు బి.శేఖర రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ టెక్కలి డివిజన్ చరిత్రలో తొలిసారిగా సుమారు 15000 ఎకరాల రబీ పంటకు విజయవంతంగా పూర్తి స్థాయిలో సాగునీటిని సరఫరా చేయడం జరిగిందని పేర్కొన్నారు. టెక్కలి పరిధిలో ఎడమ ప్రధాన కాలువ 55.728 వ కి.మీ. నుండి 104.825 కి.మీ. వరకు 41 ఆర్ డిస్ట్రిబ్యూటరీ నుండి 68 టిఇ డిస్ట్రిబ్యూటరీ వరకు టెక్కలి, సంత బొమ్మాళి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో గల 56,779 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించుట జరుగుతోందన్నారు. కాలువల నిర్వహణ పనులను కేటగిరి ఏ క్రింద మంజురుకు ప్రతిపాదనలు సమర్పించగా వాటిని మంజూరు చేసారని, మంజురైన పనులకు ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు పిలవడం జరిగిందని చెప్పారు. ఈ పనులను ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తి చేసి కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా చేయుటకు ఇబ్బందులు లేకుండా చేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కార్యాలయ పరిధిలో కాలువల నీటి పంపిణీ, పనుల పర్యవేక్షణకు మూడు సబ్ డివిజన్లు ఉన్నాయని, 12 మంది ఏ.ఇ.ఇ లకు గాను నలుగురు ఏ.ఇ.ఇలు మాత్రమే ఉన్నారని, క్షేత్ర స్థాయిలో లష్కర్లు లేకపోవుట వలన నీటి సరఫరాకు ఇబ్బందులు కలుగుచున్నాయని ఆయన వివరించారు. అయినప్పటికి ఆయకట్టుకు సాగునీరు అందించుటకు, ఆఫ్ షోర్ పనులను పూర్తి చేయుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. మహేంద్ర తనయ ఆఫ్-షోర్ ప్రాజెక్టును గూర్చి తెలియజేస్తూ ఇంతవరకు 38 శాతం పనులను గుత్తేదారు పూర్తిచేయుట జరిగిందని పేర్కొన్నారు. 2019 జూలై 31 తో పనులు పూర్తి చేయుటకు కాలపరిమితి ముగిసిందని దానిని గుత్తేదారు అభ్యర్ధన మేరకు 2021 జూలై 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అయితే కొద్ది రోజుల అనంతరం గుత్తేదారు ప్రాజెక్టు పనులను ముందస్తు ముగింపుకు దరఖాస్తు సమర్పించారని చెప్పారు. అప్పటి వరకు ఉన్న ప్రాజెక్ట్ పనుల పురోగతిని పై అధికారులకు సమర్పించుట జరిగిందని పేర్కొన్నారు. ఆఫ్-షోర్ ప్రాజెక్ట్ మిగిలిన పనులకు అంచనాలు తయారుచేసి రూ.814.13 కోట్లకు పరిపాలన ఆమోదం కొరకు నార్త్ కోస్టు చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారని తెలిపారు. పరిపాలన ఆమోదం మంజురు చేసిన వెంటనే టెండర్లు పిలిచి మిగిలిన పనులను త్వరితిగతిన పూర్తిచేయుటకు చర్యలు తీసుకొనుట జరుగుతుందని శేఖర్ రావు తెలిపారు.

# మాల్స్, రెస్టారెంట్లు యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### - విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి, ఐ.పి.ఎస్



విజయనగరం : కోవిడ్ 19 వ్యాప్తి నియత్రణా చర్యలలో భాగంగా విజయనగరం జిల్లాలోని షాపింగు మాల్స్, ప్రార్ధనా మందిరాలు, హెటల్స్ మరియు రెస్టారెంట్స్ యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి, ఐపిఎస్ మంగళవారం ు అన్నారు. ప్రభుత్వం లాక్ డౌన్ నిబంధనల నుండి షాపింగు మాల్స్, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, హెటల్స్ మరియు రెస్టారెంట్లుకు వెసులుబాటు కల్పించినప్పటికీ, ప్రజల ఆరోగ్యంను దృష్టిలో పెట్టుకొని, యాజమాన్యాలు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అదే విధంగా ప్రజలందరూ కరోనా వ్యాధి తీవ్రతను దృష్టిలో పెట్టు కొని ఎవరికి వారే స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించనట్లయితే వారి షాపులను పూర్తిగా మూసివేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కోరారు. హెటల్స్, రెస్టారెంట్లులో డైనింగు సామర్ధంలో 50శాతం మాత్రమే అనుమతించాలని, సర్వ్ చేసేందుకు, వంటలు చేసేందుకు వినియోగించే పాత్రలను ఎప్పటికప్పుడు శుద్ధి చేసే విధంగాను, ఎంట్రన్స్ లో ప్రజలు శానిటేషను చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో కూడా భక్తుల మధ్య భౌతిక దూరం పాటించాలని, పరిమిత సంఖ్యలో మాత్రమే భక్తులను అనుమతించాలన్నారు. ప్రజలంతా పోలీసుశాఖకు సహకరించి కరోనా నియంత్రణకు కృషి చెయ్యాలన్నారు. ఇప్పటికే జిల్లా పోలీసు కార్యాలయంలో సూటల్స్, ప్రార్ధనా మందిరాల కమిటీ సభ్యులు, రెస్టారెంట్లు యజమానులతో సమావేశాన్ని నిర్వహించి, ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం సూచించిన నియమ, నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. అంతేకాకుండా, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రార్ధనా మందిరాలు, హెటల్స్, రెస్టారెంట్లు యజమానులకు నోటీసులు జారీ చేయాల్సిందిగా పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లా ఎస్పీ బి. రాజకుమారి విటి అగ్రహారంలోని వై జంక్షను, డెంకాడ మండలం మోదవలస జంఎఎ వద్దగల చెక్ పోస్టులను సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేసారు. వలసదారుల వలన కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది కరోనా నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి అధికారులను ఆదేశించారు.

# లాక్‌డౌన్ సమయంలో జర్నలిస్టుల సేవలు అమోఘం

### - ప్రాణాలను పణంగా పెట్టి వార్తల సేకరణ
### - జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలి
### - జర్నలిస్టులకు నిత్యవసర సరుకులను అందజేసిన ఏ.పి.ఇ.అర్.యు



విశాఖపట్నం : లాక్‌డౌన్ సమయంలో జర్నలిస్టుల సేవలు అమోఘమని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ రిపోర్టర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకట వేణు పేర్కొన్నారు. కరోనా విస్తృతంగా ప్రబలుతున్నా జర్నలిస్టులు తమ ప్రాణాలను పణంగా పెట్టి వార్తల సేకరణ చేస్తున్నారని చెప్పారు.మంగళవారం ఎన్.ఎ.డి

జంక్షన్లో ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ రిపోర్టర్స్ యూనియన్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట వేణు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటున్న జర్నలిస్టులు ప్రస్తుతం లాక్ డౌన్ సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సాంబ శివ నాయుడు ప్రోత్సాహంతో యూనియన్ సభ్యులందరూ సమావేశమై ఈ సమయంలో జర్నలిస్టులకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ మేరకు తొలివిడతగా 50 మంది జర్నలిస్టులకు నిత్యవసర సరుకులు అందజేశామని, మరికొంతమందికి రెండో విడతలో సరుకులు అందజేస్తామని చెప్పారు. యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు నేమాల హేమసుందరరావు మాట్లాడుతూ జర్నలిస్టులకు తమ యూనియన్ అండగా ఉంటుందని చెప్పారు.కరోనా కష్ట కాలంలో అవస్థలు పడుతున్న జర్నలిస్టులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రాజ్ కుమార్, గంట చంద్రశేఖర్,గొండు అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



అచ్యుతాపురం : ఉపాధిహామీ పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు స్థానిక వర్తక సంఘం అధ్యక్షులు , వైసిపి నాయకులు మడక చిన్న మజ్జిగ పంపిణి చేశారు. మంగళవారం ఆయన వెదురువాడ పంచాయతీలో గొర్లెదర్మవరం, వెదురువాడ, లంకదర్మవరం గ్రామాల ఉపాధి కూలీలు 300 మందికి మజ్జిగ పంపిణి చేశారు .అనంతరం మడక చిన్న ఉపాధి కూలీలతో మాట్లాడుతూ పని చేసేటప్పుడు తప్పకుండ మాస్కులు దరించి, భౌతిక దూరం పాటిస్తూ , చేతులు శుభ్రంగా కడుకోవాలన్నారు . కరోనా నిబందనలు పాటించండం వలన ఆరోగ్యంగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ సర్పంచ్ లు పిల్లా బాబురావు, గొర్లె రామజోగి, మడక కోటి, స్కూలు కమిటి చైర్మన్ జి నరసింగరావు, జి.ఈశ్వరరావు సాయి కుమారి తదితరులు ఉన్నారు.

### ఉపాధ్యాయులు వృత్తిపట్ల అంకిత భావంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయి

### జిల్లా జాయింట్ కలెక్టర్ (డి) కీర్తీ చేకూరి

కాకినాడ : సమాజానికి ఉత్తమ పౌరులను అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులకు ఉందని, ఉపాధ్యాయులు వృత్తిపట్ల అంకిత భావంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా జాయింట్ కలక్టర్ (డి) కీర్తీ చేకూరి తెలిపారు. మంగళవారం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో కలక్టర్ కార్యాలయ విధాన గౌతమీ సమావేశ మందిరం నందు డి.ఎస్.సి.-2018 సం.కు సంబంధించి హింది పిండితులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి జేసి(డి) కీర్తీ చేకూరి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ సమాజంలో ఉన్న వివిధ వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని అన్నారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందని , ఉపాధ్యాయులు తమ వృత్తి పట్ల అంకిత భావంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆమె తెలిపారు.ప్రభుత్వం మన బడి- నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వపాఠశాలల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించుటకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇదే మార్పు పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు కనిపించాలన్నారు. ఉపాధ్యాయులు తాము బోధించే పాఠాల ద్వారా పిల్లల దృక్పదం పై ప్రభావం చూపించే విధంగా ఉండాలన్నారు. తాను 6వ తరగతి చదువుతున్నప్పుడు అప్పటి సోషల్ టీచర్ నీటిని అనవసరంగా వృధా చేయకూడదని చెప్పిన మాటలు ఇప్పటికతీ గుర్తున్నాయని ఆమె చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

# ఏబీ దాడులలో భారీగా మద్యం, ఇసుక స్వాధీనం

### - స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అదనపు ఎస్పీ ఎన్. శ్రీదేవీరావు





విజయనగరం : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో ఆధ్వర్యంలో జిల్లాలో దాడులు నిర్వహించి, 5,556 సారా పాకెట్లు, 39 క్వార్టరు బాటిల్లు అక్రమ మద్యం, రూ. 1200/-లు విలువ చేసే ఖైనీ, గుట్కా నిల్వలు, అక్రమంగా ఇసుక తరలిస్తున్న 07 ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్ ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీ రావు మంగళవారం తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి ఆదేశాలతో ఎస్ బి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ఎస్.ఇ. బి సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో భాగంగా పాచి పెంట పి.ఎస్ పరిధిలో 4, 866 సారాపాకెట్లు, ఒక ఆటో, 2 మోటారు సైకిల్లు, 4 సెల్ ఫోన్లు, సీతానగరం పి.ఎస్ పరిధిలో 610 సారా పాకెట్లు, పార్వతీపురం టౌన్ పి.ఎస్ పరిధిలో 80 సారా పాకెట్లు, ఎస్.కోట పి.ఎస్ పరిధిలో 22 క్వార్టరు బాటిల్లు, పూసపాటిరేగ పి.ఎస్ పరిధిలో 17 క్వార్టరు బాటిల్లు స్వాధీనం చేసుకొని, 30 మందిని అదుపులోనికి తీసుకొన్నామని, కొత్తవలస పి.ఎస్ పరిధిలో రూ. 1200/-లు విలువ చేసే ఖైనీ గుట్కాలు, స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొన్నట్లుగా, అదేవిధంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న పూసపాటిరేగ పి.ఎస్ పరిధిలో 03 ట్రాక్టర్లు, విజయనగరం రూరల్ పి.ఎస్ పరిధిలో 01 ట్రాక్టరు, డెంకాడ పి.ఎస్ పరిధిలో 02 ట్రాక్టర్లు, కొత్తవలస పి.ఎస్ పరిధిలో 01 ట్రాక్టరు స్వాధీనం చేసుకొని, 08 మంది వ్యక్తులను అదపులోనికి తీసుకొని, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ బి ప్రత్యేకాధికారి కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ బి అధికారలు సంబంధిత పోలీసు స్టేషను అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్ధిష్ట కాలపరిమితిలో ప్రభుత్వ సేవలు

-రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి




శ్రీకాకుళం : గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్దిష్ట కాలపరిమితిలో ప్రభుత్వ సేవలు అందించే వ్యవస్థకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేసారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న 10 రోజుల్లో బియ్యం, పింఛను కార్డులు., 20 రోజుల్లో ఆరోగ్యశ్రీ కార్డు,90 రోజుల్లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేసి పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాలపరిమితిలో దరఖాస్తులను పరిశీలన పూర్తిచేసి లబ్ధిదారుల ఇంటికొచ్చి తలుపుతట్టి గడపవద్దే కార్డులను గ్రామ, వార్డు వాలంటీర్లు అందజేస్తారని తెలిపారు. బయోమెట్రిక్ విధానంలో లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు నమోదు చేస్తారు. నిర్ధిష్ట కాలపరిమితిలో ప్రభుత్వ సేవలు అందించే వ్యవస్థకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. కాలపరిమితిలో సేవలు అందించని వారిపై అపరాధ రుసుము వేసే ఆలోచన కూడా చేస్తున్నట్లు సిఎం పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఇసుక రీచ్ లు ప్రారంభం కావాలని, వర్షాకాలం నాటికి ఇసుక నిలువలు ఉండాలని స్పష్టం చేసారు. ముఖ్యంగా శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, నెల్లూరు, కడప జిల్లాల కలెక్టర్లు ఇసుక నిల్వలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోజుకు 3 లక్షలు టన్నుల ఇసుక ఉత్పత్తి చేయాలని, గ్రామ సచివాలయం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. గ్రామ సచివాలయాలు, వై.యస్.ఆర్.రైతు భరోసా కేంద్రాలు, వై.యస్.ఆర్.క్లినిక్ ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ క్రింద పనులు చేసే అవకాశం ఉందని తెలిపారు. 2021 మార్చి నాటికి అన్ని నిర్మాణాలు పూర్తి కావాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ కల్పించాలని సూచించారు. సచివాలయాల ద్వారా 541 రకాల సేవలను అందిస్తున్నామని అన్నారు. సచివాలయాలలో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా ఉండాలని చెప్పారు. ఇ-క్రాప్ నమోదు శత శాతం జరగాలని అన్నారు. పంట రుణాల మంజూరుతో సహా అన్ని అంశాలకు ఇ-క్రాప్ ఆవశ్యకత ఉందని, ఆక్వాను కూడా ఇ-క్రాప్ క్రింద నమోదు చేయాలని తెలిపారు. కరోనాపై ప్రజల్లో భయం పోతే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని, వారంతట వారే బయటకు వచ్చి చెప్పగలిగే స్థితి రావాలని సిఎం అభిప్రాయపడ్డారు.

కరోనా వస్తే ఎవరికి ఫోన్ చేయాలి, ఏ మందులు వాడాలి అనే అంశాలను తెలియాలని సూచించారు.జిల్లాల్లో ఆసుపత్రుల్లో వసతులను పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఆగస్టు 3న పాఠశాలలు ప్రారంభంకావాలని చెప్పారు. నాడు-నేడు పనులు జూలై నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అక్రమ మద్యం, ఇసుకను ఉక్కుపాదంతో అణచాలని అన్నారు. ఇందుకు ఎస్పీలు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ జె.నివాస్, జాయింట్ కలెక్టర్లు డా. కె. శ్రీనివాసులు, సుమిత్ కుమార్, పోలీసు సూపరింటిండెంట్ ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, ఏ.యస్.పి పి.సోమశేఖర్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి జి.చక్రధర రావు, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్.రామ్మోహన్, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎం.చెంచయ్య, ముఖ్యప్రణాళిక అధికారి ఎం.మోహన రావు, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు టి.వేణుగోపాల్, ఏపిఎంఐపి పథక సంచాలకులు ఎ.వి.ఎస్.వి.జమదగ్ని, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు హెచ్.కూర్మారావు, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారి డా.సాయిరాం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డా.బి.జగన్నాథ రావు, రామ్మోహన్ రావు, ఐసిడిఎస్ పథక సంచాలకులు జి.జయదేవి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి భక్తులకు సత్యదేవుని దర్శన భాగ్యం



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కరోనా వైరస్ నివారణ కొరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు లాక్ డౌన్ విధించడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 20వ తేదీ నుండి భక్తులకు శ్రీ స్వామివారి దర్శనములు,ఇతర ఆర్జిత సేవలు నిలిపి వేసారు.అయితే కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆలయాలు తెరుచుటకు అనుమతి లభించడంతో నేటి నుండి భక్తులకు శ్రీ స్వామివారి దర్శన భాగ్యము కలుగుతుంది.ఈ సందర్భంగా శ్రీ స్వామివారి దర్శనార్ధము వచ్చిన భక్తులకు కరోనా నియంత్రణ చర్యలో భాగంగా ప్రతీ భక్తుడు వారి యొక్క ఆధార్ కార్డు మరియు వారి పూర్తి వివరములు తీసుకొని, ఇద్దరి మధ్య తప్పని సరిగా ఆరు అడుగుల దూరం పాటించే విధంగా మరియు ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా మాస్కులు ధరించి,హ్యాండ్ శానిటైజర్లు ఉపయోగించి సుమారుగా గంటకు 300 మందిని స్లాట్ పద్దతిలో మాత్రమే దర్శనమునకు అనుమతించేలా నిర్ణయించి చర్యలు తీసుకొనుట జరుగుచున్నది. అదేవిధంగా ఆన్ లైన్ లో స్లాట్ ద్వారా టిక్కెట్లు పొందిన ప్రతీ భక్తుడు నిర్ణీత సమయమునకు 30 ని.లు ముందుగా దేవస్థానం వారు నిర్దేశించిన కౌంటరు నందు రిపోర్ట్ చేయవలెను.అలాగే 10 సంవత్సరములు లోపు పిల్లలను,65 సంవత్సరములు పై బడిన వయస్సు వారిని,ఇతరత్రా అనారోగ్యము ఉన్న వారిని దేవాలయాలలోకి అనుమతించబడదు.కావున కోవిద్-19 నివారణ చర్యలలో భాగంగా భక్తులకు శ్రీ స్వామివారి అంతరాలయము,గర్భాలయము దర్శనములు అనుమతించబడదు. శ్రీ స్వామివారి లఘు దర్శనము మాత్రమే అనుమతించబడును. అలాగే శ్రీ స్వామివారి శఠారము,తీర్ధ ప్రసాదములు ఇవ్వబడవు.అదేవిధంగా శ్రీ స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఎటువంటి తినుబండారములు అనుమతించబడవు. భక్తులకు పంచు శ్రీ స్వామివారి నిత్య అన్న ప్రసాదమును కూడా తాత్కాలికముగా నిలిపివేయబడినది.భక్తులకు శ్రీ స్వామివారి వసతి మరియు ఆర్జిత సేవలకు అనగా శ్రీ స్వామివారి వ్రతములు,కళ్యాణములు మొదలగు సేవలకు దంపతులు ఇద్దరు మాత్రమే అనుమతించబడును.

ఈ సందర్భంగా ఈవో త్రినాధరావు మాట్లాడుతూ భక్తుల శ్రేయస్సు దృష్ట్యా భక్తులు వీలైనంత వరకు ఆన్ లైన్ ద్వారా నగదు చెల్లింపులు చేసి సహకరించవలసినదిగా కోరారు.

## కరోనా వైరస్ తో మరణించిన వ్యక్తి అంత్యక్రియలో పాల్గొన్న వారిలో భయందోళనలు

అన్నవరం : తూ.గో.జిల్లా తొండంగి మండలం పి.ఇ.చిన్నయ్య పాలెం లో కరోనాతో మరణించాడని తెలియక 40 ఏళ్ల వ్యక్తి అంత్యక్రియల్లో పాల్గొన్న 30 మంది ఇప్పుడు భయంతో వణుకుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల అస్వస్థతతో విజయవాడ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు.పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఈ నెల 5న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆ తర్వాతి రోజు ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహం నుంచి నమూనాలు సేకరించిన వైద్యులు వాటిని కోవిడ్ పరీక్షలకు పంపారు. అయితే మరోవైపు ఫలితం రాకుండానే ఈ నెల 7న మృతదేహాన్ని గ్రామానికి తరలించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.కాగా మృతుడికి కరోనా సోకినట్టు సోమవారం వైద్యులకు నివేదిక అందింది.దీంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పోలీసులు రంగంలోకి బాధిత కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించారు. అంత్యక్రియల్లో 30 మంది వరకు పాల్గొన్నట్టు అధికారులు గుర్తించారు. వారికి పరీక్ష నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వారంతా ఇప్పుడు కరోనా భయంతో వణుకుతున్నారు.

# పరవాడ నూతన సిఐగా ఉదయ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



పరవాడ: పరవాడ నూతనసర్కిల్ ఇన్స్ పెక్టర్ గా పివిబి ఉదయ్ కుమార్ సోమవారము బాధ్యతలు స్వీకరించారు. అనంతరము అయన విలేఖర్లుతో మాట్లడుతూ గతంలో కొయ్యూరు సర్కిల్ ఇన్స్ పెక్టర్ గా 2సంవత్సారాల మూడు నెలలు, మల్కాపురం సర్కిల్ ఇన్స్ పెక్టర్ గా పదినెలలు విదులు నిర్వర్తించామన్నారు. నేరాలు అదుపులో రాజీపడును అని అన్నారు.

లాఅండ్అర్డర్ కు భంగం కలిగిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు అని తెలిపారు.

# పాడిరైతులకు హెరిటేజ్ డెయిరీ బోనస్

మేనేజర్ కూండ్రపు శేషు



అచ్యుతాపురం : మండలంలో రామన్నపాలెం గ్రామంలో 60 మంది హెరిటేజ్ డెయిరీ పాడిరైతులకు...

కరోనా బోనస్ రూ. 3.45 లక్షలను డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు మంగళవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమమే ద్యేయంగా డెయిరీ పనిచేస్తుందన్నారు.

# నిరుపేదల కడుపు నింపేందుకు.. ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలి...

ప్రముఖ సంఘ సేవకులు, ప్రజా సేవకులు.. విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం : భారీ వర్షంలోనూ...గర్భిణీలు, బాలింతలు, పేదలు, అనాధలకు అన్నం పెట్టిన...వివేకానంద సంస్థ..

ఓవైపు భారీ వర్షం పడుతోంది... ఆ సమయంలో ..అనాధలు, నిరుపేదలు, గర్భిణీలు, బాలింతల పరిస్థితి ఏంటి? రాత్రంతా వారు ఆకలితో ఉండి పోవాల్సిందేనా?..

లేదు వారు ఆకలితో ఉండకూడదు.. వారి కడుపులు నింపాలనే.. సంకల్పబలంతో... వివేకానంద సంస్థ సభ్యులు ఆటోల్లో ఆహార పొట్లాలు వేసుకొని బయలుదేరారు..కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా...రోడ్లు, రైల్వే స్టేషన్, బస్ స్టాప్ లు, ఫుట్ పాత్ ల పై జీవనం

సాగించే అనాధలకు.. వర్షంలో తడుస్తూనే.. ఆహార పొట్లాలు అందించారు.. భారీ వర్షం ధాటికి నిలువ నీడ లేక చిమ్మచీకట్లో ..బిక్కుబిక్కుమంటూ..దుకాణాల ముంగిట.. ఓ మూలన కూర్చున్న.. అనాధలను వెతికి మరీ ఆహార పొట్లాలు అందించారు...

అంతటితో ఆగిపోకుండా.. ప్రభుత్వ ఘోషా ఆస్పత్రిలో ఉన్న.. గర్భిణీలు, బాలింతలకు వారి సహాయకులకు వారి వద్దకే వెళ్లి ఆహార పొట్లాలు అందించారు.. ప్రముఖ సంఘ సేవకులు, ప్రజా సేవకులు, ఆధ్యాత్మికవేత్త విల్లూరి భాస్కరరావు ఆర్థిక సహాయంతో..

ఈ సేవా కార్యక్రమం నిర్వహించామని, ఆయన చేతుల మీదుగానే..అనాధలకు, గర్భిణీలకు, బాలింతలకు భోజనాలు అందించామని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు వెల్లడించారు.. ఇటువంటి మంచి మనసున్న దాతలు మరింతమంది ముందుకు వస్తే.. ఇంకా ఎక్కువ మంది ఆకలి తీరుస్తామని,

మంచి మనసుతో దాతలు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.. కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తోన్న ప్రస్తుత పరిస్థితుల్లో.. పేదల కడుపు నింపేందుకు.. ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని విల్లూరి భాస్కరరావు కోరారు.. ప్రతీ ఒక్కరూ తమకు చేతనైనంత సాయాన్ని పేదలకు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు..

# చింతల శ్రీనుకు మెరుగైన వైద్యం అందించాలి

సాయి పూజా ఫౌండేషన్ చైర్మన్ మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ వైద్యులకు సూచన



విశాఖపట్నం: చోడవరం నివాసి శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చింతల శ్రీను కేజీహెచ్ లో జాయిన్ అయినట్లు

న్యూ కాలనీ వాసి అయ్యంకుల ఈశ్వర్ రావు ఇచ్చిన సమా చారం మేరకు

సాయి పూజా ఫౌండేషన్ చైర్మన్ మాజీ కార్పొరేటర్ వాన పల్లి రవికుమార్ వెళ్లి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందిం చాలని సూచించారు.

ఈ కార్యక్రమం లో పప్పు అప్పల రాజు, రాజేష్, వెంకటాద్రి.శ్రీను పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ప్రజలను అదుకునేందుకు నిరంతరం కృషి

కాకినాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాల ప్రజలను అదుకునేందుకు నిరంతరం కృషి చేయు చున్నారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రోసెసింగ్ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. మంగళవారం కాకినాడ రవణయ్యపేట ఫిష్ మార్కెట్, కాకినాడ రూపల్ మండలంలో చేపల వర్తకులకు మరియు కట్టర్లకు ఐస్ బాక్స్ లు మంత్రి తన క్యాంపు కార్యాలయం నందు మంత్రి కురసాల కన్నబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాల ప్రజలను అదుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఎటువంటి కష్టం వచ్చినా స్పందించి ,సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తున్నారని మంత్రి తెలిపారు.

# లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి : జిల్లా కలెక్టర్ డి.మురళీధర్‌రెడ్డి



కాకినాడ : ప్రభుత్వం వినూత్న రీతిలో ప్రవేశపెట్టిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల సేవలను వినియోగించుకొని, లబ్దిదారులకు ఉదారంగా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం కాకినాడ కలక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో కలక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేసం నిర్వహించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు 1357 రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామస్తులకు, రైతాంగానికి విశిష్ట సేవలందించే విధంగాఇవి రూపుదిద్దుకున్నాయన్నారు. బ్యాంకర్లు తాము లబ్దిదారులకు ఇచ్చే రుణాలతో పాటు వాటి రికవరీ విషయంలో నూతనంగా ఏర్పడిన ఈ వ్యవస్థల సేవలను వినియోగించుకుని, మరింత ప్రోత్సాహకరమైన బ్యాంకింగ్ సేవలు అందించాలన్నారు. 50 కుటుంబాలకు ఒక వాలంటీర్, ప్రతి సచివాలంలో సంక్షేమం, వ్యవసాయ సహాయకులు పని చేస్తున్నారని, వీరి సేవలు వినియోగించుకోవాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఎటువంటి దరఖాస్తులు నేరుగా జిల్లా కలక్టర్ కార్యాలయంలో తీసుకునే విధానాన్ని స్వస్తి పలకడం జరిగిందన్నారు. బియ్యం, పింఛన్లు, ఆరోగ్య శ్రీ, ఇళ్ళ పట్టాలకు సంబంధించిన దరఖాస్తులు నేరుగా సచివాలయాల్లోనే స్వీకరించే విధంగా అన్ని ఏర్పాట్లు జరిగాయన్నారు. గత సంవత్సరం రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా జిల్లాలో 63 వేల మంది కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. అదే తరహాలో ఈ ఆర్ధిక సంవత్సరానికి లక్ష మంది కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని కలక్టర్ బ్యాంకర్లకు కోరారు. ముఖ్యంగా పట్టణ వ్యాపార్లుల్లో రోజు వారీ వ్యాపారాలు చేసే స్ట్రీట్ వెండర్లకు ఉదారంగా రుణాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వివిధ వర్గాలకు అందించే ఆర్థిక సహాయంతో పాటు సున్నా వడ్డీ లాంటి రుణాలను లబ్దిదారుల ఖాతాలకే జమ చేయాలని, ఏదైన ఇతర అప్పులు ఉంటే వాటికి జమ చేయకూడదన్నారు. ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సహించే విధంగా తగు కార్యాచరణ అమలు చేస్తుందని, వీటిని ఆయా వర్గాలలో అవగాహన కల్పించి ఔత్సాహికులైన వారికి రుణాలు అందించాలని కలక్టర్ బ్యాంకర్లకు పలు సూచనలు చేశారు. ఔత్సాహికులైన చిన్న తరహా పరిశ్రమలు నిర్వహించే వారికి వర్కింగ్ క్యాపిటల్ ఇబ్బందులు లేకుండా బ్యాంకర్లు సహరించాలని జేసి(ఢబ్ల్యూ) జి.రాజకుమారి తెలిపారు. ఆటో నగర్ లో నిర్వహించే చిన్న చిన్న పరిశ్రమలకు రుణ సౌకర్యాలు విరివిగా అందించాలని మహిళా పారిశ్రామికవేత్తలకు పరిశ్రమలు స్థాపించే విధంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలని జేసి రాజకుమారి సూచించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2020-21 కి 27 వేల కోట్లుగా నిర్ణయించారు. వీటిలో పంట రుణాలు 5.59 లక్షల రైతులకు 9341.62 కోట్లు, వ్యవసాయం అనుబంధ రంగాలకు (టర్మ్ లోన్ లు) 3.12 లక్షల రైతులకు 5625.93 కోట్లుగా నిర్ణయించారు. అదే విధంగా ఇతర ప్రాధాన్యతా రంగాలైన హౌసింగ్ లోన్లు 850 కోట్లు, విద్యా రుణాలు 180.72 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలు 254.44 కోట్లు , సుక్ష్మ పరిశ్రమలు 382 కోట్లు, చిన్న తరహా పరిశ్రమలు 4182 కోట్లు, మధ్యతరహా పరిశ్రమలు 347.58 కోట్లు గా నిర్ణయిచారు.అదే విధంగా స్వయం సహాయక సంఘాలకు 1,935.71 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు 5836.15 కోట్లు వార్షిక ప్రణాళికను విడుదల చేసారు. ఈ సందర్భంగా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి, జేసి జి.రాజకుమారి, యూనియన్ బ్యాంక్ ఏజియం పివి హరిప్రకాష్, ఎల్.డి.యం. షణ్ముఖేశ్వరరావు జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2020-21ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్.సత్తి బాబు, వివిధ బ్యాంకుల ఏజియంలు, నాబార్డుఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌ను విమర్శించే అర్హత లోకేష్‌కు లేదు

## ● రాష్ట్ర అభివృద్ధిని చూసి చంద్రబాబు, లోకేష్ వైకాపాపై అసత్య ఆరోపణలు

## ● గత టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పూర్తిగా నిర్లక్ష్యం



విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని, కుట్రలతో ప్రభుత్వం పై బురద చల్లాలని ప్రయత్నిస్తున్నారని పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే ముఖ్యమంత్రుల పనితీరులో టాప్ ఫైవ్ లో సీఎం వైఎస్ జగన్ ఉన్నట్లు సర్వేలో వెల్లడైందన్నారు. టీడీపీ ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోలేదని, ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా నీరుగార్చిందని నిప్పులు చెరిగారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీని ఇతర రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

**పాత బకాయిలతో సహా చెల్లించాం..**

"గత టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే పాత బకాయిలతో సహా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. ప్రతీ నెలా ఒకటో తేదీనే ఉదయం ఆరు గంటలకే పెన్షన్ అందిస్తున్న ఘనత మాది. మీరు అధికారంలో ఉన్నప్పుడు వెయ్యి రూపాయిల ఇచ్చిన పెన్షన్ ని మేము రెట్టింపు చేశాం. త్వరలో 2,500 రూపాయిలు కూడా చేయబోతున్నాం. ఈ ఏడాది జులై 7 న రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల పైగా పేదలకి ఇళ్ల స్థలాలు ఇవ్వబోతున్నాం. ఎన్నికల హామీలలో తొలి ఏడాదిలోనే 90 శాతం హామీలు నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ ది. దశలవారీ మద్యపాన నిషేధంలో భాగంగా రాష్ట్రంలో దుకాణాలని 33 శాతం తగ్గించాం. రాష్ట్రంలో వైఎస్సార్ జలయజ్ఞ పేరుతో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టలు పూర్తి చేయడంపై దృష్టి సారించాం. ప్రజలకి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని" అవంతి శ్రీనివాస్ తెలిపారు.

**లోకేష్ భ్రష్టు పట్టించారు..**

చంద్రబాబు, లోకేష్ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఎమ్మెల్యేగా కూడా గెలవలేని లోకేష్‌కు సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. "గత ఐదేళ్లగా చంద్రబాబుని భ్రష్టు పట్టించింది లోకేష్ కాదా? గత ఐదేళ్లు కూడా కుల జాడ్యం, అవినీతికి, అక్రమాలకి లోకేష్ కారణం కాదా? లోకేష్ నాయకత్వాన్ని మీ ఎమ్మెల్యేలలో ఒక్కరైనా ఒప్పుకుంటారా. లోకేష్ వల్లే టీడీపీ పూర్తిగా దెబ్బతిన్న మాట వాస్తవం కాదా? ఎల్జీ పాలిమర్స్ ఘటన జరిగిన తర్వాత బాధితులని లోకేష్ ఎందుకు పరామర్శించలేదని' మంత్రి ప్రశ్నించారు.

**వారు ట్విటర్,జూమ్‌లకే పరిమితం అయ్యారు..**

దురుద్దేశ్యంతో లోకేష్ చేస్తున్న విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. చంద్రబాబు, లోకేష్ జూమ్, ట్విటర్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఓడిపోయారనే కారణాలతో కళా వెంకట్రావుని పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని లోకేష్ కుట్రలు చేస్తున్నారని అవంతి ఆరోపించారు. అన్ని వనరులు ఉన్న విశాఖని గతంలోనే చంద్రబాబు రాజధానిగా చేసి ఉంటే రాష్ట్రాభివృద్ధికి ఎంతో అవకాశం ఉండేదన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలని మూడు రాజధానులు ప్రకటిస్తే.. కుట్రలతో అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. విశాఖ భవిష్యత్తులో అంతర్జాతీయ నగరంగా ఎదుగుతుందని అవంతి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న కరోనా కేసులు: డబ్ల్యూహెచ్‌వో



జెనీవా: ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు తీవ్రమవుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అధ్యక్షుడు టెడ్రోస్ అధనామ్ హెచ్చరించారు. (జూన్ 7న) ఒక్కరోజే ప్రపంచంలో 1,36,000 కరోనా కేసులు పెరిగినట్లు వెల్లడించారు. ఇందులో అమెరికా, దక్షిణాసియాలోని పది దేశాల్లోనే 75 శాతం కేసులు ఉన్నాయని చెప్పారు. గత తొమ్మిది రోజుల్లో లక్ష మందికి వైరస్ సోకినట్లు తెలిపారు. ఒక్క రోజులో ఇన్ని పాజిటివ్ కేసులు నమోదవడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్‌లో చైనాలో పుట్టిన ఈ ప్రాణాంతక వైరస్ ఇప్పటివరకు 4,03,000 మందిని పొట్టనపెట్టుకుందని, 70 లక్షల పాజిటివ్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. చైనా తర్వాత తూర్పు ఆసియా కరోనాకు కేంద్రంగా మారిందని, అనంతరం అది యూరప్ ఖండానికి విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం కరోనాకు ప్రధాన కేంద్రంగా ఉన్న అమెరికా వాటిని అధిగమించిందని తెలిపారు. అమెరికాలో జరుగుతున్న జాతివ్యతిరేక ఆందోళనలతో వైరస్ మరింతగా వ్యాప్తిచెందే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కొన్ని దేశాల్లో వైరస్ వ్యాప్తి తక్కువగా ఉన్నదని, మరికొన్ని దేశాల్లో కేసుల సంఖ్య వెయ్యిలోపే ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో సానుకూల పరిస్థితులు ఉన్నాయని, అయితే నిర్లక్ష్యమే వారికి ముప్పుగా మారే అవకాశం ఉందన్నారు. ఐరోపాలో పరిస్థితి మెరుగు పడుతున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఇది మరింత దిగజారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

## 15 రాష్ట్రాలకు కేంద్ర బృందాలు

ఢిల్లీ: కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. కోవిడ్-19 కట్టడికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. దేశవ్యాప్తంగా అధికంగా కరోనా కేసులు నమోదు అవుతున్న 15 రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించనున్నాయి. 50కి పైగా జిల్లాలు, మున్సిపాలిటీలకు కేంద్రం బృందాలను కేంద్ర ఆరోగ్య శాఖ నియమించింది. మహారాష్ట్ర (7) తెలంగాణ (4), తమిళనాడు (7), రాజస్థాన్ (5), అస్సాం (6), హర్యానా (4), గుజరాత్ (3), కర్ణాటక (4), ఉత్తరాఖండ్ (3), మధ్యప్రదేశ్ (5), పశ్చిమ బెంగాల్ (3), ఢిల్లీ(3), బీహార్ (4), ఉత్తర ప్రదేశ్ (4), ఒడిశా (5) జిల్లాలు, మున్సిపాలిటీలకు కేంద్ర బృందాలు నియమించారు.

ముగ్గురు సభ్యులతో ఒక్కో బృందం ఏర్పాటు చేశారు. బృందంలో ప్రజారోగ్య నిపుణులు, ఎపిడెమియాలజిస్టులు, వైద్యులు, సీనియర్ జాయింట్ సెక్రటరీ స్థాయి నోడల్ అధికారి ఉంటారు.

ఈ బృందాలు నగరాల్లోని కేసుల నియంత్రణ చర్యలు, సమర్థవంతమైన చికిత్స నిర్వహణలో రాష్ట్ర ఆరోగ్య శాఖకు తోడ్పడటానికి ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను పర్యవేక్షిస్తాయి.

## జ్యోతిరాదిత్య సింధియాకు కరోనా పాజిటివ్



హైదరాబాద్: బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియాకు కరోనా వైరస్ సంక్రమించింది. కరోనా పరీక్షలో ఆయన పాజిటివ్‌గా తేలారు. ఢిల్లీలోని సాకేత్‌లో ఉన్న మ్యాక్స్ హాస్పిటల్‌లో ఆయన పరీక్ష చేయించుకున్నారు. జ్యోతిరాదిత్య సింధియాతో పాటు ఆయన తల్లి మాధవి రాజ్ సింధియాకు కూడా కరోనా వైరస్ సంక్రమించినట్లు పరీక్షలో రుజువైంది. కరోనా లక్షణాలతో బాధపడుతున్న జ్యోతిరాదిత్య.. నాలుగు రోజుల క్రితం మ్యాక్స్ సాకేత్ హాస్పిటల్‌లో చేరారు. జ్యోతిరాదిత్యలో లక్షణాలు ఉన్నా.. ఆయన తల్లిలో మాత్రం లక్షణాలు కనిపించడంలేదు. ఇద్దరూ ప్రస్తుతం ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. బీజేపీ జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్రలో కూడా కరోనా లక్షణాలు బయటపడ్డాయి. గూర్గావ్‌లోని మేదాంత హాస్పిటల్‌లో చేరిన ఆయన డిశ్చార్జ్ అయ్యారు.

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా ఇవాళ కరోనా పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

## వలస కూలీలపై కేసులు ఎత్తేయాలి : సుప్రీం

దిల్లీ: వలస కూలీల అంశంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈసందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. స్వస్థలాలకు వెళ్లాలనుకుంటున్న వలస కూలీలను గుర్తించి 15 రోజుల్లో తరలించాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.

రాష్ట్రాలు అడిగిన 24 గంటల్లో శ్రామిక్ రైళ్లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. వలస కూలీలపై నమోదు చేసిన లాక్‌డౌన్ ఉల్లంఘన కేసులు ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

స్వస్థలాలకు చేరుకున్న వలస కూలీలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పథకాలు అమలు చేస్తున్నాయి, వారికి ఎలాంటి ఉపాధి కల్పిస్తున్నారో వివరిస్తూ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. దీనికి సంబంధించిన నివేదికను అందజేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను సుప్రీంకోర్టు జులై 8కి వాయిదా వేసింది.

## కొత్త ఒరవడికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం



తాడేపల్లి: సంక్షేమ పథకాల అమల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ సేవలన్నీ గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్దిష్ట కాలపరిమితితో అర్హులందరికీ అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. సంతృప్త స్థాయిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని సీఎం పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన పది రోజుల్లోనే బియ్యం కార్డు, పది రోజుల్లో పింఛన్ కార్డు, 20 రోజుల్లో ఆరోగ్యశ్రీ కార్డు, 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు అందిస్తామని ఆయన వెల్లడించారు. 44 లక్షల నుంచి 58 లక్షలకుపైగా పెన్షన్లు పెంచామని గుర్తు చేశారు. అర్హులకు రూ.2,250 పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. అవినీతి లేని వ్యవస్థను తీసుకొచ్చామని సీఎం వైఎస్ జగన్ ఉద్ఘాటించారు. పథకాల అమలుకు సంబంధించి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆయన సూచించారు. అనంతరం స్పందన కార్యక్రమంపై కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'లబ్ధి దారుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిం చాలి. అర్హత వివరాలు, దరఖాస్తు చేసుకునే సమాచారం కూడా అందించాలి. వచ్చిన దరఖాస్తును గడువులోగా వెరిఫికేషన్ చేయాలి. లబ్ధిదారులకు బియ్యం కార్డులు, పింఛను కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులను డోర్ డెలివరీ చేయాలి. బయోమెట్రిక్ అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలి. నిర్ణీత సమయంలోగా ఆ సేవలు అందించలేకపోతే వారికి పరిహారంకూడా చెల్లిస్తాం. కలెక్టర్లు, జేసీల పనితీరు దీనిపై ఆధారపడి ఉంటుంది'అని పేర్కొన్నారు. కాగా, ఇళ్ల నిర్మాణం కోసం ఎవరైనా మిగిలిపోతే అప్లికేషన్లు పెట్టమని చెప్పామని అధికారులు సీఎంకు తెలిపారు. వాటి పరిశీలన కూడా పూర్తవుతోందని అన్నారు.

ఇప్పటివరకూ 30.3 లక్షల మందిని లబ్ధిదారులుగా గుర్తించామని అధికారులు చెప్పారు. జూన్ 12 కల్లా లబ్దిదారుల తుది జాబితాను ప్రదర్శించాలని సీఎం తెలిపారు. జూన్ 15 కల్లా పాత లబ్ధిదారులకు సంబంధించి ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు అవసరమైన కార్యక్రమాలు పూర్తిచేయాలని అన్నారు. జూన్ 30 కల్లా కొత్త లబ్ధిదారులకు సంబంధించి ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు అవసరమైన కార్యక్రమాలు పూర్తిచేయాలని సీఎం చెప్పారు.

## నగరంలో హడలెత్తిస్తున్న కరోనా కేసులు ...

### - అప్రమత్తమైన జీవీఎంసీ అధికారులు - ఎక్కడికక్కడ బారికేట్లు ఏర్పాటు




కంచరపాలెం : నగరం లో కరోనా కేసులు హడలెత్తిస్తున్నాయి. జీవీఎంసీ 52వవార్డు శాంతినగర్ ప్రాంతానికి చెందిన తండ్రి కొడుకులకు పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఆ ప్రాంతప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కాగా అదే కుటుంబంలో తల్లికి కూడా పరీక్షలు చేయించగా ఆమెకునెగిటివ్ వచ్చింది. తండ్రి (43), అతని కొడుకు (13)లు తరచూ విజయనగరంలో ఉంటున్న స్నేహితుడి ఇంటికి వెళ్తుండేవారని వైద్యులు చెబుతున్నారు. అదే స్నేహితుడికి కరోనా సోకడంతో వీరిద్దరూ పరామర్శకువెళ్లాచ్చినట్టు తెలుస్తోంది.

రెండు రోజులుగా వీరిద్దరూ అస్వస్థతకు గురవ్వడంతో వైద్యుడ్నిసంప్రదించారు.

పాజిటివ్ నిర్ధారణ కావడంతో క్వారంటైన్‌కు తరలించారు. ఇదిలా ఉంటే ఇదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తికి కరోనా రాగా, 14రోజుల క్వారంటైన్ అనంతరం కోలుకున్నాడు. ఇదే ప్రాంతంలో తాజాగా తండ్రి కొడుకులకు కరోనా రావడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇదిలా వుండగా 51 వ వార్డు పరిధి ఆర్ . అండ్.బి కూడలి వద్ద ఒక అపార్ట్ మెంట్ లో 65 ఏళ్ళ వృద్ధుడికి కరోనా నిర్ధారణ కావడంతో జీవీఎంసీ జోన్ -4 అదికారులతో పాటుగా ఎయిర్ పోర్ట్ పోలీసు అప్రమత్తమయ్యారు.

ఈమేరకు అపార్ట్ మెంట్ పరి శర ప్రాంతల్లో బరికెట్ లను ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేసారు . ఆ ప్రాంతాన్ని సందర్శించిన జోన్-4 కమిషనర్ సింహాచలం హైపో క్లోరైడ్ ద్రావణాన్ని చల్లించారు. పారిశుధ్ధ్య పనులు ముమ్మరం చేశారు.

## రైతు భరోసా కేంద్రాలకు శంకుస్థాపన చేసిన మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గంలోని పద్మనాభం మండలం మద్ది, ఆనందపురం మండలం గండిగుండం, భీమిలి మండలం మజ్జివలస గ్రామాలలో ఏడాది పూర్తి అయిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను,రైతు భరోసా కేంద్రాలను పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేసారు. అలాగే పద్మనాభం మండలం మద్ది గ్రామంలో రైతుభరోసా కేంద్రానికి అనంతరం మండల కార్యాలయం వద్ద వాలింటర్స్ తో సమావేశం నిర్వహించి ఆయా వార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో మంత్రి అవంతి మాట్లాడుతూ ఒక్క ఆనంద పురం మండలంలోని 5 కోట్లతో అనేకమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమలు నిర్వహించామన్నారు. పాదయాత్ర లో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ 90 శాతంపైగా నెరవేర్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com